ప్రజాశక్తి

గురువారం 7 మార్చి, 2024 5 శ్రీకాకుళం

ముగ్గురు ఇంటర్ విద్యార్థుల డిబార్

1041 మంది గైర్హాజరు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షల్లో భాగంగా బుధవారం మాల్ ప్రాక్టీస్ చేస్తూ... ముగ్గరు విద్యార్థులు పట్టుబడ్డారు. మిగిలిన చోట్ల పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. 83 కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షలకు 22,297 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా, 22,505 మంది హాజరయ్యారు. 1041 మంది గైర్హాజరయ్యారు. వీరిలో జనరల్ గ్రూపు విద్యార్థులు 22,158 మంది రాయాల్సి ఉండగా, 21,236 మంది హాజరయ్యారు. ఒకేషనల్ విద్యార్థులు 1391 మంది హాజరు కావాల్సి ఉండగా, 1269 మంది రాశారు. ఇంటర్ పరీక్షల్లో 3 మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదయ్యాయని ఇంటర్ బోర్డు ప్రాంతీయ అధికారి (ఆర్ఐఒ) ప్రగడ దుర్గారావు తెలిపారు.

ఆ ఎమ్మెల్యే మాకొద్దు

- జగన్ ముద్దు... ఎమ్మెల్యే వద్దంటూ కొత్తూరులో ర్యాలీ
- రెడ్డి శాంతికి టిక్కెట్ ఇస్తే ఓడిస్తాం
- అధిష్టానానికి వైసిపి అసమ్మతి నాయకుల అల్టిమేటం

ఎమ్మెల్యే రెడ్డి శాంతిపై రోజురోజుకీ అసమ్మతి తీవ్రతరమవుతోంది. పాతపట్నంలో ఈ నెల 1న నిర్వహించిన 'మేం సిద్ధం...మా బూత్ సిద్ధం సమావేశానికి నియోజకవర్గ ముఖ్య నాయకులు గైర్హాజరైన విషయం తెలిసిందే. ఎన్నికల్లో కీలకంగా వ్యవహరించే బూత్ కమిటీ సభ్యుల సైతం హాజరు కాలేదు. ఇది ఇలా ఉండగా కొత్తూరులో బుధవారం నియోజకవర్గానికి చెందిన స్థానిక ప్రజాప్రతినిధులు, సర్పంచ్‌లు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు 'జగన్ ముద్దు... రెడ్డి శాంతి' వద్దు అనే పేరుతో ర్యాలీ, సమావేశం నిర్వహించారు. దీనికి నియోజకవర్గం నలుమూలల నుంచి అధిక సంఖ్యలో కార్యకర్తలు తరలివచ్చి ఎమ్మెల్యే రెడ్డి శాంతిపై తమ వ్యతిరేకతను వెలిబుచ్చారు.

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి, కొత్తూరు

ఎమ్మెల్యే రెడ్డి శాంతిపై అసమ్మతి గ్రూపు నాయకులు మరోసారి తమ గళం విప్పారు. ఆమెపై ఉన్న అసంతృప్తిని కొత్తూరు కేంద్రంగా వెళ్లగక్కారు. పాతపట్నంలో ఈ నెల ఒకటో తేదీన 'మేం సిద్ధం..మా బూత్ సిద్ధం పేరుతో నిర్వహించిన సమావేశాన్ని బహిష్కరించిన ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు ఆమె ధీటుగా కొత్తూరులోని స్థానిక బయ్యాల చిట్టిబాబు కళ్యాణ మండపంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ ర్యాలీ నిర్వహించారు. జగన్ ముద్దు... ఎమ్మెల్యే వద్దంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో పలువురు నాయకులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఎమ్మెల్యే రెడ్డి శాంతిని అభ్యర్థిగా ప్రకటిస్తే ఓడిస్తామని స్పష్టం చేశారు. సర్వేలన్నీ ప్రతికూలంగా ఉన్నాయని, అధిష్టానం మళ్లీ ఆమెకే టికెట్ ఇచ్చే సాహసం చేస్తుందని తామనుకోవడం లేదని చెప్పారు. ఎమ్మెల్యేగా ఉండి తన సొంత కుమారుడిని జడ్‌పిటిసిగా గెలిపించుకోలేని రెడ్డి శాంతి ఎలా గెలుస్తారని ప్రశ్నించారు. పాతపట్నం నియోజకవర్గంలో వైసిపి హ్యాట్రిక్ విజయం సాధించాలంటే స్థానిక అభ్యర్థి జిల్లా పార్టీ కోశాధికారి లోతుగెడ్డ తులసి వరప్రసాదరావును బరిలో దింపాలని నాయకులు, కార్యకర్తలు ముక్తకంఠంతో కోరారు. అభ్యర్థి ప్రకటన బట్టి తమ నిర్ణయం ఉంటుందని అధిష్టానానికి తేల్చి చెప్పారు.

వైసిపి జిల్లా కోశాధికారి లోతుగడ్డ తులసీవరప్రసాదరావు మాట్లాడుతూ ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉన్న నేపథ్యంలో రెడ్డి శాంతిని మార్చి సరైన అభ్యర్థిని ప్రకటించాలని కోరారు.

ర్యాలీ నిర్వహిస్తున్న వైసిపి నాయకులు

నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలోనూ ఎమ్మెల్యేపై వ్యతిరేకత ఉందని చెప్పారు. సొంత పార్టీ నాయకులు, కార్యకర్తలనే ఎమ్మెల్యే ఇబ్బందులకు గురి చేశారని ఆయన దుయ్యబట్టారు. ఎమ్మెల్యేగా గెలిపించిన తర్వాత నియోజకవర్గ ప్రజలకు, పార్టీ కార్యకర్తలకు ఆమె ఏం న్యాయం చేశారని ప్రశ్నించారు. అధిష్టానం నియోజకవర్గ ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని అభ్యర్థిని మార్చాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

సమావేశంలో మాజీ ఎమ్మెల్యే ధర్మాన నారాయణరావు, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు బయ్యాల చిట్టిబాబు, హిర మండలం మండల పరిషత్ ప్రత్యేక అహ్వానితుడు తూలుగు తిరుపతిరావు, వెలమ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గంగు వాసు, కొత్తూరు ఎంపిపి సవర సావిత్రి రమేష్, వైసిపి మండల మాజీ అధ్యక్షుడు రేగేటి షణ్ముఖరావు, ఎంపిటిసి వీర్రాజు, పాతపట్నం మండల సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షులు మజ్జి భుజంగరావు, కొత్తూరు మండల వైసిపి మాజీ అధ్యక్షులు లోతుగెడ్డ తాతబాబు, కాపు సంఘం జిల్లా అధ్యక్షుడు సర్పంచ్, కొయిలాపు శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు బమ్మిడి జగన్నాథం, ఎం?శ్రీనివాసరావు, సంజీవరావు, రేగేటి కన్నయ్య, సుమారు 1500 మంది బూత్ స్థాయి కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓట్ల కోసమే చంద్రబాబు బిసిల జపం

రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

ఎన్నికలకు వస్తుండటంతో చంద్రబాబు మరోసారి బిసిల జపం చేస్తున్నారని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. శ్రీకాకుళం నగరంలోని స్థానిక టౌన్ హాల్‌లో బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బిసి జయహో అంటూ ఆ తరగతులను మభ్యపెట్టే పని చంద్రబాబు మొదలుపెట్టారని వ్యాఖ్యానించారు. బిసిలకు రాజ్యాధికారం ఇవ్వాలన్న ఆలోచన చంద్రబాబుకు ఏనాడూ కలగలేదన్నారు. బిసిలకు చెందిన ఒక్క వ్యక్తినీ రాజ్యసభకు పంపలేదని, అటువంటి నాయకుడు ఆ తరగతులకు రాజకీయ అధికారం ఇస్తారని ఎవరైనా నమ్ముతారా? అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి రాజ్య సభకు నలుగురిని పెద్దల సభకు పంపారని గుర్తుచేశారు. బాబు పాలనలో బిసిల పేరుతో కొన్ని కార్యక్రమాలు అమలు చేయడం, వాటిలో కొన్నింటిని పంచి, మిగిలనవి సొంత మనుషులకు ఇచ్చేయడం చేశారని చెప్పారు. వైసిపి ప్రభుత్వం డిబిటి ద్వారా బిసిలకు రూ.1.22 లక్షల కోట్లను అందించామని అన్నారు. సబ్‌ప్లాన్‌పై టిడిపి విమర్శలు చేస్తోందని, అంతకంటే ఎక్కువ మొత్తాన్ని బిసిలకు ఆర్థిక సాయంగా తమ ప్రభుత్వం అందించిందని చెప్పారు. బిసిలకు సామాజిక న్యాయం విషయంలో వైసిపికి, టిడిపికి ఒక చర్చా వేదిక నిర్వహించి చంద్రబాబు గాని, టిడిపి నాయకులు రావాలని సవాల్ విసిరారు. వైసిపి హయాంలో బిసి సామాజిక తరగతులకు చెందిన 12 మంది మంత్రులు రాష్ట్ర క్యాబినెట్‌లో ఉన్నారని అన్నారు. 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేసి ఆ తరగతులకు జగన్మోహన్‌రెడ్డి నాయకత్వం ఇచ్చారని చెప్పారు. బాబు చుట్టూ ఉన్నది ధనవంతుల కూటమని, వారి ప్రయోజనాలు తప్ప పేద ప్రజల జీవన ప్రమాణాలను పెంచలేరని చెప్పారు. జయహో బిసి పేరుతో చంద్రబాబు చెప్పే మోసపూరిత మాటలను ఎవరూ నమ్మరని అన్నారు. ఎన్నికల్లో లబ్ధిపొందేందుకు అధికారం చేజిక్కుంచుకోవడానికి తప్ప మరొకటి కాదని స్పష్టం చేశారు. చంద్రబాబు చెప్పే మాటలు విని మోసపోయేందుకు ప్రజలు సిద్ధంగా లేరని అన్నారు.

11న జీడి మద్దతు ధరపై ధర్నా

ప్రజాశక్తి- పలాస

జీడి పిక్కలకు మద్దతు ధర ప్రకటించి బస్తాకు రూ.16 వేలు చెల్లించి రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని ఎపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోనారి మోహనరావు, జీడి రైతుల సంఘం జిల్లా కన్వీనర్ తెప్పల అజయ్ కుమార్ డిమాండ్ చేశారు. కాశీబుగ్గలో ఈ నెల 11న కాశీబుగ్గ గాంధీ విగ్రహం వద్ద జీడి పిక్కల మద్దతు ధరపై ధర్నా చేపడుతున్నామని, రైతులు పాల్గొని ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జీడి రైతుల సంఘం, వామపక్షాల ఆధ్వర్యాన ధర్నా పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీడి పిక్కలకు మద్దతు ధర ప్రకటించాలని కోరుతూ ఏడాది కాలంగా జీడి రైతు సంఘం ఆందోళన చేపడుతుందని అన్నారు. ఈ నేపథ్యంలో ఫిబ్రవరి 1న ప్రభుత్వం ఆ సంఘాన్ని చర్చలకు పిలిచి, మద్దతు ధరపై జిఒ ఇస్తామని ఇచ్చిన హామీను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఐదేళ్లుగాజీడి రైతులను ధగా చేస్తుందన్నారు. జీడి రైతులకు ఇచ్చిన ఏ ఒక్క హామీ కూడా నెరవేర్చలేదని విమర్శించారు. ఆర్‌బికెల ద్వారా రైతులు పండించే అన్ని పంటలకూ మద్దతు ధర ప్రకటించి కొనుగోలు చేస్తామని చెబుతున్నా... ప్రభుత్వం ఆచరణలో శూన్యం అని ఎద్దేవా చేశారు. న్యాయమైన కోర్కెలతో జీడి రైతులు చేస్తున్న పోరాటానికి ప్రజలూ మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి, జీడి రైతు సంఘం నాయకులు ఎస్.కృష్ణారావు, జీడి రైతుల సంఘం నాయకులు టి.భాస్కరరావు, ఎపి రైతు కూలి సంఘం నాయకులు కె.గురయ్య, ఎన్.హడ్డి, కె.హేమారావుచౌదరి, కె.పురుషోత్తం, వంకల మాధవరావు, చాపర వేణుగోపాల్, మద్దిల రామారావు పాల్గొన్నారు.

పోస్టర్‌న ఆవిష్కరిస్తున్న నాయకులు

సెక్టోరియల్ అధికారుల బాధ్యత కీలకం

- ప్రీ పోల్, పోలింగ్ సమయంలో అలసత్వం వద్దు
- కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఎన్నికల నిర్వహణలో సెక్టోరియల్ అధికారులు బాధ్యతగా పనిచేయాలి, ఎన్నికల కమిషన్ సూచనలను శతశాతం తుచ తప్పకుండా పాటించాలని కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ అన్నారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ఎన్నికల సెక్టోరియల్ అధికారులకు, సెక్టార్ పోలీస్ అధికారులకు శిక్షణా తరగతుల్లో ఎస్‌పి జి.ఆర్.రాధికతో పాటు కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సెక్టోరియల్ అధికారులు తమ పరిధిలోని అన్ని పోలింగ్ కేంద్రాలు, రూట్‌లపై సమగ్ర అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రతి పోలింగ్ స్టేషన్‌కూ రూట్ మ్యాప్ ముందుగానే సిద్ధం చేసుకోవాలన్నారు. సమస్యాత్మక కేంద్రాలను సున్నితమైన పోలింగ్ కేంద్రాలను గుర్తించాలన్నారు. కమ్యూనికేషన్ మ్యాపింగ్ తయారు చేసి తక్షణమే స్పందించేందుకు తమ పరిధిలోని ఎన్నికల నిర్వహణ అత్యవసర విధులు హాజరవుతున్న వారి ఫోను నంబర్లను కలిగి ఉండాలన్నారు. ఎస్‌పి మాట్లాడుతూ సమస్యాత్మక, సంక్లిష్ట పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సెక్టార్ పోలీస్ అధికారులు సెక్టార్ అధికారులతో కలిసి ప్రతి గ్రామాన్నీ సందర్శించాలని ఆదేశించారు. జెసి మల్లారపు నవీన్ మాట్లాడుతూ సెక్టోరియల్ అధికారులు పోలింగ్ రోజున అన్ని పోలింగ్ కేంద్రాలకు సంబంధించి రిపోర్టులను ఎన్నికల కంట్రోల్ రూమ్‌కు నియమావళి ప్రకారం అందజేయాలన్నారు. ఏదైనా పోలింగ్ కేంద్రంలో సమస్యలు ఉంటే తక్షణమే స్పందించి పరిష్కరించాలన్నారు. పోలింగ్ కేంద్రంలో ఇవిఎంల్లో సమస్య ఉత్పన్నమైతే సెక్టోరియల్ అధికారులు తమ వద్ద ఉన్న రిజర్వ్ పరికరాలతో వాటిని భర్తీ చేయాలన్నారు. శిక్షణా కార్యక్రమలో సహాయ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, డిఆర్‌ఒ ఎం.గణపతిరావు, శిక్షణ తరగతుల నోడల్ అధికారి బాలాజీ, మాస్టర్ ట్రైనర్ శేషగిరి స్పెషల్ బ్రాంచ్ డిఎస్‌పి త్రినాథరావు పాల్గొన్నారు.

అభివృద్ధే ధ్యేయం

శాసనసభ స్పీకర్ సీతారాం

శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న స్పీకర్ సీతారాం

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

అభివృద్ధే ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి ధ్యేయమని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని తెలికిపెంట పంచాయతీ పాతపాడులో వైఎస్ఆర్ ఆరోగ్య కేంద్రం, విజయరాంపురంలో గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, చిగురువలసలో రైతు భరోసా కేంద్రం, వైఎస్ఆర్ ఆరోగ్య కేంద్రం నూతన భవనాలను బుధవారం ప్రారంభించారు. అలాగే తెలికిపెంట, పాతపాడు, లొద్దల కాగితాపల్లి, వీరభద్రాపురం, యరగాం గ్రామాల్లో జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ తాగునీటి కుళాయిల ద్వారా తాగునీరు అందించే పథకాలకు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి కె.వి.జి.సత్యనారాయణ, మండల పార్టీ అధ్యక్షులు బెవర మల్లేశ్వరరావు, మార్కెట్ కమిటీ అధ్యక్షులు బెవర కృష్ణవేణి, పిఎసిఎస్ అధ్యక్షులు కోవిలాపు చంద్రశేఖర్ వైస్ ఎంపిపి శివానందబాబు, బిసి సెల్ డైరెక్టర్ ముడడ్ల రమణ, ఎస్‌సి సెల్ డైరెక్టర్ ఎడ్ల ఈశ్వరరావు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం

ఎస్‌పి జి.ఆర్ రాధిక

జి.ఆర్ రాధిక, ఎస్‌పి

ప్రజాశక్తి- శ్రీకాకుళం

సామాజిక మాధ్యమంలో వచ్చే ప్రకటనలు నమ్మి ప్రజలు మోసపోవద్దని, ప్రతిఒక్కరూ సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్‌పి జి.ఆర్.రాధిక ప్రకటనలో సూచించారు. కొందరు నేరస్తులు నేరుగా మీ ఫోన్ నంబర్లకు ఫోన్ చేసి మీరు కొరియర్ రూపంగా డ్రగ్స్ బుక్ చేశారని, మీ చిరునామకు మాదకద్రవ్యాలు వచ్చాయని, తాము ముంబై, ఢిల్లీ, నార్కోటిక్స్ పోలీసులమంటూ వీడియో కాల్ చేసి నమ్మబలికే అవకాశాలు ఉన్నాయని అన్నారు. మీపై కేసు లేకుండా ఉండాలంటే డబ్బు ఇమ్మని మోసం చేసి నగదును డిమాండ్ చేస్తున్నారని అన్నారు. ఇలాంటి ఫోన్ కాల్స్‌కు స్పందించద్దని, అలాంటి మోసగాళ్ల వివరాలు మీ సమీపంలోని పోలీసులకు తెలియజేయాలన్నారు. ఆన్‌లైన్ ఉద్యోగ పేరిట ఉద్యోగపు ఆశ చూపే మోసగాళ్లతో జాగ్రత్తగా ఉండాలన్నాడు. వారిని నమ్మి మీ యొక్క వ్యక్తిగత వివరాలు ఇవ్వరాదని అన్నారు. పార్ట్ టైం జాబ్స్ పేరిట వచ్చే లింక్స్ క్లిక్ చేసి మోసపోకండని అన్నారు.

తక్కువ పెట్టుబడులతో అధిక లాభాలు వస్తాయని ఆశ చూపి జరుగుతున్న ఆన్‌లైన్ మోసాలకు గురికావద్దన్నారు. ఇంటర్నెట్‌లో గూగుల్ వగైరా సెర్చ్ ఇంజిన్ ద్వారా ఏదైనా ఆన్‌లైన్ ఫిర్యాదు చేద్దామని మీరు ఏదైనా కంపెని పేర్లు, కస్టమర్ కేర్ నంబర్లను వెతికే క్రమంలో మోసగాళ్లకు ఫోన్ చేయవద్దన్నారు గుర్తు తెలియని, అపరిచిత నంబర్ల నుంచి వచ్చే మెసేజ్‌లు, లింకులకు క్లిక్ చేయరాదన్నారు. ఎవరైనా ఈ విధంగా మోసపోయినట్లయితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. సైబర్ హెల్ప్ లైన్ నంబరు 1930ను తక్షణమే సంప్రదించాలన్నారు. నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ www.cybercrime.gov.inలో ఫిర్యాదు చేయాలని తెలియజేశారు.

661 మందికి ఇన్‌పుట్ సబ్సిడీ

నమూనా చెక్కును అందజేస్తున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో గతేడాది సంభవించిన మిచాంగ్ తుపానులో నష్టపోయిన 661 మంది రైతులకు రూ.32.21 లక్షలు ఇన్‌పుట్ సబ్సిడీ ప్రభుత్వం విడుదల చేసినట్టు కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ తెలిపారు. కలెక్టరేటులో ఇన్‌పుట్ సబ్సిడీ నమూనా చెక్కును బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతాంగానికి ప్రకృతి వైపరీత్యాల వల్ల జరిగిన నష్టాలను ప్రభుత్వం గుర్తించి ఆర్థికంగా ఆదుకుంటోందన్నారు. జిల్లాలో పంట నష్టపోయిన రైతన్నలకు నష్టపరిహారాన్ని వ్యక్తిగత ఖాతాలో డిబిటి పద్ధతిలో జమ చేశామన్నారు. అర్హులు ఏ ఒక్కరూ మిగిలిపోకుండా ఈ-క్రాప్ ఆధారంగా పంట నష్టాలను అంచనా వేస్తూ గ్రామ సచివాలయాల్లో అర్హుల జాబితా ప్రదర్శించారని అన్నారు. సీజన్‌లో జరిగిన పంట నష్టాన్ని సీజన్ ముగిసేలోగానే ప్రభుత్వం చెల్లించిందని అన్నారు. సహాయ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, వ్యవసాయశాఖ జెడి కె.శ్రీధర్, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ నేతాజీ, డిసిఎంఎస్ చైర్మన్ గొండు కృష్ణమూర్తి, ఉద్యాన అధికారి ఆర్.వి.ప్రసాద్ పాల్గొన్నారు.

చర్చకు సిద్ధం

టిడిపి జిల్లా అధ్యక్షులు రవికుమార్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

బిసిలకు సామాజిక న్యాయం విషయంలో రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు చేసిన సవాల్‌కు టిడిపి సిద్ధంగా ఉందని టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ ప్రతి సవాల్ చేశారు. నగరంలోని జిల్లా టిడిపి కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. ఈ ఐదేళ్లలో బిసిలకు అనేక పదవులు ఇచ్చామని గొప్పలు చెపుతున్న మంత్రి ఏనాడైనా ఆ పదవిని నిర్వర్తించారా? అని ప్రశ్నించారు. చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌లు బిసి డిక్లరేషన్‌ను ప్రకటిస్తే ఎందుకు భయపడుతున్నారన్నారు. వైసిపి పాలనలో పదవుల్లో ఉన్న బిసి మంత్రులు, ఎమ్మెల్యేలు, చివరకు 56 కార్పొరేషన్ పదవుల్లో ఉన్న నాయకులు ఆ ఐదుగురికి చేతిలో వంచనకు గురయ్యారని ఘాటుగా విమర్శించారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి ఎంతో మంది బిసిలను నాయకులుగా తయారు చేశారని అన్నారు. బిసి తరగతికి చెందిన శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం తొమ్మిదేళ్ల పాటు టిడిపి ప్రభుత్వంలోనే మంత్రిగా పనిచేసి ఎదిగారని గుర్తుచేశారు. రాజ్యసభకు కిమిడి కళావెంటకరావుకు హోంమంత్రి పదవి ఇచ్చారని, రాజ్యసభకు పంపించారని పేర్కొన్నారు. మాజీ మంత్రి అచ్చెన్నాయుడు, ఆయన సోదరుడు ఎర్రన్నాయుడు, ప్రస్తుత ఎంపీ రామ్మోహననాయుడు, మాజీ మంత్రులు గుండ అప్పలసూర్యనారాయణ, గౌతు శివాజీలకు పెద్దపీట వేశామన్నారు. వీరంతా బిసిలేనని ధర్మాన మరచిపోయారన్నారు. ప్రస్తుతం మంత్రిగా సొంతంగా ప్రజలకు ఏంచేస్తున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. బిసిల డిక్లరేషన్ అమలుకు 10 హామీలు ఇస్తున్నామని, వాటిపై కూడా ప్రజలు చర్చించుకుంటు న్నారని అన్నారు. సమావేశంలో పార్టీ ఉపాధ్యక్షులు పి.ఎం.జె.బాబు, సింతు సుధాకర్, ఎస్‌సి సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.వి.రమణమాదిగ, బిసి రాష్ట్ర సాధికారత తెలికుల సంఘ కమిటీ సభ్యులు రామరాజు. జిల్లా ఐటిడిపి అధ్యక్షులు ప్రదాన విజయరాం పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కూన రవికుమార్

వైద్యారోగ్యశాఖ ఎఒగా బాబూరావు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో పరిపాలనాధికారిగా ఆర్.బాబూరావు నియమితులయ్యారు. డిఎంహెచ్‌ఒ డాక్టర్ బొడ్డేపల్లి మీనాక్షిని బుధవారం కలిసి నియామకపత్రాన్ని అందుకున్నారు. ఆయన ఇప్పటి వరకు రిమ్స్ వైద్య కళాశాలలో సెక్షన్ సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఆయనకు ఉద్యోగోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం ఎఒగా నియమించింది. ఇక్కడ గతంలో ఎఒగా పనిచేసిన బాస్కర్ కుమార్‌ను ఇటీవల సస్పెండ్ చేశారు. ఆయన స్థానంలో బాబూరావు బాధ్యతలు చేపట్టారు.

నియామకపత్రం అందజేస్తున్న మీనాక్షి

నేడు పొన్నాడలో మాక్ డ్రిల్

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

పరిశ్రమల్లో ప్రమాదాలు జరిగే సమయంలో అప్రమత్తతపై కార్మికులకు, ప్రజలకు అవగాహన కల్పించేందుకు మాక్ డ్రిల్ ఏర్పాటు చేస్తున్నట్లు డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ (కర్మాగారాల ఉప ముఖ్య తనిఖీ అధికారి) బి.రాంబాబు ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని పొన్నాడలో ఈ నెల 7న ఉదయం 9 గంటలకు స్మార్ట్ కెం టెక్నాలజీస్ ప్రయివేట్ లిమిటెడ్‌లో మాక్ డ్రిల్ నిర్వహించనున్నట్లు వివరించారు. ప్రమాద సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలనే ఉద్దేశంతో మాక్ డ్రిల్‌పై అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.

JDRS 1 AND 2 లకు CPC 0-21 R-35 NOTICE

మహారాజశ్రీ సోంపేట సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు

E.P 4/2023 in O.S 81/20213

1. కొంచాడ భాగ్యలక్ష్మి (లేటు)
2. కొంచాడ కామేశ్వరరావు
3. కొంచాడ లక్ష్మి
4. కొంచాడ అనంత్ కుమార్
5. కొంచాడ శ్రీరామ్ --డిక్రీ హోల్డర్స్

(1ST DHR DIED AND 4TH DHR HAS BEEN REP. AS HER LEGAL HEIR AND AMENDED AS PER MEMO DT. 20-12-2021)

మరియు:

1. లండా బైరాగి
2. లండా శారదవురపు శైలజా
3. కొంచాడ కిషోర్ కుమార్
4. అందవరపు రాధిక

To,

JDR-1: లండ భైరాగి

JDR-2:. లండ సరళ వురపు శైలజా గార్లకు బలరాంపురం గ్రామం, ఇచ్ఛాపురం మండలం.

--ప్రతివాదులు

పై నంబరు అమలు డిక్రీ షెడ్యూల్ దాఖలా స్థలం డిక్రీ హోల్డర్స్ ది అయి ఉండి అందు మీ జన ఇరువురు అక్రమముగా భవనం నిర్మించియుండగా సదరు భవనము కూల్చి వేసి (మీ ఖర్చులతో) డిక్రీ హోల్డర్స్ స్థలము అప్పగించమని కోరి కోర్టులో అమలు పిటిషన్ దాఖలు చేయగా సదరు అమలు పిటిషన్లో మీ జన ఇరువురకు అనగా JDR-1, JDR-2 లకు కావలసిన ఆర్డర్-21. రూల్ - 35 నోటీసులో పేపరు పబ్లికేషన్ ద్వారా అమలు చేయుటకు కోర్టు వారు ఆర్డరు చేసియున్నారు. అయితే సదరు అమలు మోపిన **తే 13-03-2024 దీన వాయిదా అయి ఉన్నాది.** కాబట్టి ఇందు విషయమై మీకు ఏమైనా అక్షేపణలు ఉన్న యెడల పైన ఉదహరించిన **తేదిని ఉదయం గం॥ 10-30 ని॥లకు** మీరు కోర్టుకు హాజరై కోర్టువారికి మనవి చేసుకోవలెను. లేని యెడల మీ పరోక్షమందు విచారించి తీర్మానించడం అగునని ఇందుమూలంగా తెలియపరచడమైనది.

షెడ్యూల్

శ్రీకాకుళం జిల్లా, సోంపేట మండలం, సోంపేట పంచాయితీ బిరుసువాడలోని ఖాళీ స్థలం దక్షణ శ్రేణిలో సర్వే నెం. 211/3 పట్టా నె.. 167లో విస్తీర్ణం తూ॥ప॥ 42 అడుగులు (12.60 మీటర్లు) ఉ॥ ద॥ 70 అడుగులు (21.60 మీటర్లు) అది 336 చదరపు అడుగులు 27432 చ॥ మీ॥ స్థలంకు హద్దులు

తూర్పు: ఎస్, లివింగుటాన్ వగైరాలు ఖాళీ స్థలం.

దక్షిణ: యర్ర గున్నమ్మ ఖాళీ స్థలం.

పడమర: నగిరి సోల్మాన్ రాజు ఖాళీ స్థలం.

ఉత్తర: రాజమార్గం.

M. SARVESWARARAO
ADVOCATE
SOMPETA, SRIKAKULAM,
CELL.7569054890

రాజమండ్రి నుంచి కొబ్బరి దిగుమతి

అడ్డుకున్న ఉద్దానం రైతులు

ప్రజాశక్తి - కవిటి

ఓవైపు దిగుబడులు పూర్తిగా తగ్గిపోయి నిస్పృహలో ఉన్న కొబ్బరి రైతుకు కొబ్బరికాయలు వ్యాపారం చేస్తున్న కొంతమంది దళారులు కోలుకోలేని దెబ్బ కొడుతున్నారు. రాజమండ్రి, అమలాపురం తదితర ప్రాంతాల నుంచి అక్రమంగా కొబ్బరికాయలు దిగుమతి చేసి స్థానిక కొబ్బరి రైతుల నోట్లో మట్టి కొడుతున్నారు. మొదటి నుంచీ కవిటి మండలం కొబ్బరికి నాణ్యత, పరిమాణంలో మంచి పేరు ఉండడంతో మిగతా ప్రాంతాల కొబ్బరి ధర కంటే అధికంగా చెల్లించి వ్యాపారులు కొనుగోలు చేసేవారు. అయితే ఇటీవల కాలంలో ఏర్పడిన తీవ్ర వర్షాభావ పరిస్థితులు కొబ్బరి దిగుబడులపై గణనీయమైన ప్రభావం చూపిస్తున్నాయి. దీంతో ఐదెకరాలు ఉన్న కొబ్బరి రైతుకు వెయ్యి కొబ్బరికాయలకు మించి దిగుబడి రాని పరిస్థితి ఏర్పడింది. దీంతో ఇటీవల కాలంలో మండలంలో వెయ్యి కొబ్బరికాయల ధర రూ.22 వేలకు చేరుకుంది. దీన్ని ఆసరాగా తీసుకుని కవిటి మండలం వరకలో ఉంటున్న ఓ కొబ్బరికాయల దళారీ రాజమండ్రి నుంచి సుమారు లక్ష కొబ్బరి కాయలు అతితక్కువ ధరకు దిగుమతి చేసి గ్రామంలో నిల్వ చేసి ఉంచాడు. వాటిని స్థానికంగా ఉన్న రూ.22 వేల ధరకు విక్రయించేందుకు కొంతమంది బయట వ్యాపారులతో ఒప్పందం చేసుకున్నాడు. అయితే ఇటీవల కాలంలో మండలం మొత్తం చూసినా దొరకని కాయలు తమ గ్రామంలో ఉండడం గమనించిన వైసిపి నాయకుడు, స్థానిక రైతు శ్రీకాంత్ పురియా స్థానిక కొబ్బరి రైతులను అప్రమత్తం చేశాడు. దీంతో బుధవారం ఉదయం అక్రమంగా దిగుమతి చేసిన కొబ్బరికాయల వద్దకు రైతులందరూ చేరుకున్నారు. సదరు దళారీని నిలదీశారు. అయినప్పటికీ ఆ దళారి తనకు లైసెన్స్ ఉందని, మార్కెట్ కమిటీకి రుసుం చెల్లించే వ్యాపారం సాగిస్తున్నానంటూ బుకాయించేందుకు ప్రయత్నించాడు. దీంతో కొంత మంది రైతులు మార్కెట్ కమిటీ ప్రతినిధులను సంప్రదిస్తే వారు చేతులెత్తేశారు. దీంతో చేసిన తప్పుకు రూ.50 వేలు పరిహారం చెల్లించి, భవిష్యత్‌లో ఇటువంటి అక్రమాలకు పాల్పడనని లిఖితపూర్వకంగా తెలియజేయడంతో రైతులు విడిచిపెట్టారు. అనంతరం రైతులు బడగల చిట్టిరాజు, తమరాల రమణ, బెండి యతేంద్రనాథ్ తదితరులు మాట్లాడుతూ కొంతమంది దళారీల వల్ల కొబ్బరి మార్కెట్ పూర్తిగా నాశనమైందని, ఇప్పటికే దిగుబడి లేక దిగాలు పడిన కొబ్బరి రైతుకు ఇటువంటి సంఘటనలు కోలుకోలేని దెబ్బతీస్తాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మార్పు అప్పలరాజు, దేవరాజ్ పురియా, జగదీష్ బిసాయి పాల్గొన్నారు.

దళారితో మాట్లాడుతున్న రైతులు

తాగునీటి కుళాయిలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శాంతి

ఇంటింటికీ తాగునీరు

ప్రజాశక్తి- పాతపట్నం

జలజీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికి మంచినీరు అందించడం జరుగుతుందని ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. మండలంలోని రొమదలలో జల జీవన్ మిషన్ నిధులతో నిర్మించిన ఇంటింటికీ కుళాయిలను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగనన్న పాలనలో జరిగిన, జరుగుతున్న అభివృద్ధిని గ్రామస్తులకు వివరించారు. ఐదేళ్లుగా జగనన్న ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలను నేరుగా వారి ఖాతాలోకి జమ చేశారని, మళ్లీ వస్తున్న ఎన్నికల్లో సిఎంగా గెలిపించాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి ప్రదీప్, శ్యామ్ సుందర్, సచివాలయాల కన్వీనర్ సూర్యం, వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న జెడ్‌పి చైర్‌పర్సన్ విజయ

అభివృద్ధికి చిరునామా వైసిపి

ప్రజాశక్తి- కవిటి

రాష్ట్రంలో అభివృద్ధికి చిరునామాగా వైసిపి ప్రభుత్వం నిలుస్తోందని జెడ్‌పి ఛైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. మండలం భైరిపురంలో రూ.43 లక్షలతో పలు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో అభివృద్ధి, సంక్షేమం పూర్తిస్థాయిలో అందించిన ఘనత వైసిపికే చెందిందన్నారు. ప్రతిపక్షాలు ఎన్ని అబద్ధాలు చెప్పినా రాబోయే ఎన్నికల్లో వైసిపి అఖండ విజయం సాధించి, సిఎం జగన్మోహన్ రెడ్డి మరోసారి జనరంజక పాలన అందిస్తారన్నారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి కడియాల ప్రకాష్, ఎఎంసి వైస్ చైర్మన్ వై.నీలయ్య, పిఎసిఎస్ అధ్యక్షుడు దేవరాజు సాహు, సర్పంచ్ పి.రమాదేవి, వైస్ సర్పంచ్ తిరుపతి, ఎంపిటిసి జగదీశ్వరి పాల్గొన్నారు.

టెక్కలి రూరల్ : అవగాహన కల్పిస్తున్న డిటి, గణాంకాధికారి

ఓటు వినియోగంపై అవగాహన

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి ఐతమ్ ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో బుధవారం ఓటు హక్కు వినియోగంపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల డిటి వాన శంకరరావు, టెక్కలి డివిజినల్ గణంకాధికారి పిసి నందాలు పాల్గొని మాట్లాడారు. 18 ఏళ్లు పూర్తయిన వారు ఎలా ఓటును నమోదు చేసుకోవాలి, ఓటు హక్కును ఇవిఎంల ద్వారా వినియోగించుకొనే విధానంపై ప్రత్యక్షంగా యంత్రాలను చూపించి అవగాహన కల్పించారు. అనంతరం ఓటు హక్కు వినియోగంపై ర్యాలీ నిర్వహించి యువతను చైతన్య పరిచారు. కార్యక్రమంలో డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి. నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, డీన్ డాక్టర్ డి.విష్ణుమూర్తి, ఎన్.ఎస్.ఎస్ పిఒ డాక్టర్ బి.బలరాం, విద్యార్థులు పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు: ఓటుహక్కు వజ్రాయుధం కంటే శక్తివంతమైనదని, కొత్తగా ఓటరుగా నమోదు చేసుకున్న యువత ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ మామిడి సురేష్ కోరారు. ఓటుహక్కు వినియోగంపై పూండి సాయి వినీత్ డిగ్రీ కాలేజీలో బుధవారం స్వీప్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో డిటి వాయిలపల్లి గిరిధర్, విఆర్ఒలు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎచ్చెర్ల : నిర్భయంగా ఓటు వేయాలని చిలకపాలెం, ఎచ్చెర్ల గ్రామాల్లో బుధవారం కేంద్ర పోలీసు బలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. సిఐ రామచంద్రరావు, ఎస్ఐ చిరంజీవి ఆధ్వర్యంలో గ్రామాల్లో ర్యాలీ చేపట్టారు. ప్రజాస్వామ్యబద్ధంగా, స్వేచ్ఛగా ప్రజలు ఓటుహక్కు వినియోగించుకోవాలన్నారు.

ఇన్వర్టర్‌ను అందజేస్తున్న నారాయణమూర్తి

పాఠశాలకు ఇన్వర్టర్ వితరణ

ప్రజాశక్తి- గార

మండలంలోని ఊరవల్లి మండల పరిషత్ యుపి పాఠశాలకు ఇన్వర్టర్ వితరణ చేసేందుకు 8వ తరగతి విద్యార్థులు చందాలు వేసుకున్నారు. కాగా, ఇన్వర్టర్‌కు కొనుగోలు నిమిత్తం మరికొంత మొత్తం అవసరం కావడంతో ఈ విషయం తెలుసుకున్న బోరవెల్లి సర్పంచ్ ప్రతినిధి మల్ల నారాయణమూర్తి తక్షణమే రూ 20 వేల విలువైన ఇన్వర్టర్‌ను కొనుగోలు చేసి ఉపాధ్యాయుల సమక్షంలో బుధవారం అందజేశారు. గతంలో పాఠశాలకు అవసరమైన సిసి కెమెరాలూ ఈయన బహూకరించారు. విద్య, వైద్య రంగాలపై ప్రతిఒక్కరూ శ్రద్ధను చూపించాలని కోరారు. పాఠశాలకు భవిష్యత్‌లో ఎటువంటి అవసరం వచ్చినా తన వంతు సహాయం చేస్తారని భరోసానిచ్చారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.గణేష్శ్వరరావు, షేక్‌జాఫర్, మల్ల మాధవనాయుడు, పాఠశాల కమిటీ చైర్మన్ పి.వరంబాబు పాల్గొన్నారు.

విద్యాహక్కు చట్టాన్ని వినియోగించుకోవాలి

పొందూరు: విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలల్లో 25శాతం సీట్లును ప్రభుత్వం కేటాయిస్తుందని, ఈ చట్టాన్ని అర్హత కలిగిన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సమగ్ర కమ్యూనిటీ మొబలైజేషన్ అధికారి పేడాడ ప్రభాకరరావు పేర్కొన్నారు. ఎంఇఒ కార్యాలయాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఐదేళ్లు నిండిన పిల్లలు 1వ తరగతిలో ప్రవేశాలకు సైట్‌ను తెరిచినట్లు పేర్కొన్నారు. ప్రతికూల పరిస్థితులు ఎదుర్కొంటున్న వర్గాలు, అనాధ పిల్లలు, హెచ్ఐవి బాధితులు, దివ్యాంగులకు 5శాతం, దళిత వర్గాలకు 10శాతం, గిరిజనులకు 4శాతం, బలహీన వర్గాలకు చెందిన బిసి, మైనారిటీ, ఒసి గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారికి 6శాతం సీట్లును కేటాయిస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాలకు లబ్దిదారుల వార్షిక ఆదాయం రూ.1.20లక్షలు, పట్టణ ప్రాంత లబ్దిదారుల వార్షిక ఆదాయం రూ.1.44లక్షలు మించరాదని తెలిపారు. ఈయనతో పాటు ఎంఇఒ-2 పట్నాన రాజారావు ఉన్నారు.

మాట్లాడుతున్న సిఎంఒ ప్రభాకరరావు

రైతు ఉత్పత్తిదార్లకు నాబార్డు చేయూత

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

మాట్లాడుతున్న వరప్రసాద్

జిల్లాలో రైతు ఉత్పత్తిదార్లకు ప్రభుత్వ, ప్రయివేటు బ్యాంకులు, స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో నాబార్డు వివిధ పథకాలను అందించి ఆర్థికంగా బలోపేతం చేసేందుకు సాయపడుతున్నట్టు సంస్థ జిల్లా అభివృద్ధి అధికారి కె.వరప్రసాద్ తెలిపారు. నగరంలోని ప్రభుత్వ మహిళా కళాశాల సెమినార్ హాల్లో వివిధ బ్యాంకులు, స్వచ్ఛంద సంస్థలు, రైతు ఉత్పత్తిదారుల కంపెనీల ప్రతినిధులతో బుధవారం సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో నాబార్డు ద్వారా ప్రభుత్వ శాఖల సమన్వయంతో అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తున్నట్టు తెలిపారు. వ్యవసాయ, ఉద్యాన, మత్స్యశాఖ, పరిశ్రమల శాఖ, ఫుడ్ ప్రాసెసింగ్, బ్యాంకుల అభివృద్ధి రంగాల్లో నాబార్డు అందిస్తున్న సహకారాన్ని వివరించారు. స్వయంశక్తి సంఘాలకు జాయింట్ లైబిలిటీ గ్రూప్‌లకు అవగాహన కల్పించామన్నారు.

మత్స్యశాఖ జిల్లా అధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన ద్వారా ఫిష్ ఆంధ్రా హబ్స్ ఏర్పాటు చేసి సబ్సిడీతో వ్యాపారాల నిర్వహణకు ప్రోత్సహిస్తున్నట్టు వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఎడి త్రినాథస్వామి, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ సూర్యకిరణ్, డిసిసిబి బ్యాంకు అసిస్టెంట్ జనరల్ మేనేజర్ రామకృష్ణారావు, డిఐసి ఉమామహేశ్వరరావు, డిఆర్‌డిఎ పీడీ ఎం.నాగలక్ష్మి, బ్రెడ్స్ సంస్థ సెక్రటరీ సాంబమూర్తి, ఆర్ట్స్ సంస్థ డైరెక్టర్ సన్యాసిరావు, వైసిబి డైరెక్టర్ ప్రసాదరావు, సిఎవిఎస్ డైరెక్టర్ ఇషా పాల్గొన్నారు.

నేడు జెడ్‌పిలో వర్క్‌షాప్

శ్రీకాకుళం అర్బన్ : ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు రాజకీయ పార్టీ ప్రతినిధులతో, మీడియా ప్రతినిధులతో గురువారం ఉదయం జిల్లా పరిషత్‌లో ప్రత్యేక వర్క్‌షాప్ ఏర్పాటు చేస్తున్నామని కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ తెలిపారు. జిల్లాలో పారదర్శక అనుబంధ (సప్లిమెంట్) ఓటర్ల జాబితాల రూపకల్పనకు యంత్రాంగం ఎక్కడ, ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ తెలిపారు. కలెక్టరేట్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో బుధవారం సమావేశాన్ని నిర్వహించారు. అనుబంధ ఓటర్ల జాబితా మార్పులు, చేర్పులు, రానున్న 2024 ఎన్నికల సన్నద్ధతపై వివరిం చారు. వారం రోజుల్లో మార్పులు, చేర్పులు కోరుతూ 2099 మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. కీలకమైన అంశాలపై ఈ సమావేశంలో చర్చించడంతో పాటు అవగాహన కల్పిస్తామన్నారు. జెసి ఎం.నవీన్, సహాయ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, టిడిపి నుంచి పి.ఎం.జె.బాబు, కాంగ్రెస్ నుంచి దేశెల్ల మల్లిబాబు, బిజెపి నుంచి సురేష్‌బాబు, బిఎస్‌పి నుంచి ఎల్.సోమేశ్వరరావు, వైసిపి నుంచి శంకరరావు పాల్గొన్నారు.

అర్ధరాత్రి పోలీస్‌స్టేషన్ వద్ద ఉద్రిక్తత

దళితుడు, జర్నలిస్టుపై ఎస్ఐ జులుం

ప్రజాశక్తి- పలాస

పోలీస్ స్టేషన్ వద్ద ధర్నా చేస్తున్న మహిళలు

కాశీబుగ్గ పోలీస్ స్టేషన్ వద్ద మంగళవారం అర్ధరాత్రి సమయంలో ఉద్రిక్తత వాతావరణం చోటుచేసుకుంది. మున్సిపాలిటీకి చెందిన దళిత మహిళలు తమకు అన్యాయం జరిగిందని ఇచ్చిన ఫిర్యాదుకు పోలీసులు స్పందించకపోవడంతో ధర్నా చేపట్టారు. న్యాయం జరిగే వరకు స్టేషన్ బయట బైఠాయించారు. అదే సమయంలో ఓ పత్రికా విలేకరి వివరాలు సేకరించేందుకు వచ్చారు. జర్నలిస్టుపైన కాశీబుగ్గ ఎస్ఐ-2 జులుం ప్రదర్శించారు. వివరాల్లోకి వెళ్తే... పలాస మున్సిపాలిటీ పరిధి 29 వార్డులో మంగళవారం ఉదయం మంచినీటి కోసం పవర్ బోర్ వద్దకు వచ్చిన మహిళలపై నారాయణరావు అనే వ్యక్తి దురుసుగా ప్రవర్తించారు. మహిళలను చూడకుండా పైపైకి వచ్చి దురభాషలు ఆడారని దళిత మహిళలు కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రాత్రి కావస్తున్నా పోలీసులు స్పందించలేదు. మరలా నారాయణరావు వార్డులోకి వచ్చి మీరు ఫిర్యాదు ఇచ్చిన నాకు ఏమి జరగదని, మహిళలకు తెచ్చుకొట్టే విధంగా మాట్లాడడంతో రాత్రి 11 గంటల సమయంలో ఒక్కసారిగా 30 మందికి పైగా మహిళలు కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్ వద్దకు చేరుకొని ఆందోళన చేపట్టారు. అదే సమయంలో కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న ఎస్ఐ-2 వెంకటరావు ధర్నా చేస్తున్న మహిళలపై, దళితుడు రాజారావుపై విరుచుకపడ్డాడు. పోలీస్ స్టేషన్ ముందు ధర్నా ఎందుకు చేస్తున్నారని, తక్షణమే ఇక్కడ నుంచి వెళ్లిపోవాలని దురుసుగా ప్రవర్తించారు. అదే సమయంలో సంఘటన సమాచారం తెలుసుకున్న జర్నలిస్టు మోహన్ అక్కడకు వెళ్లి వార్తను సేకరిస్తుండగా... ఒక్కసారిగా ఎస్ఐ దురుసుగా ప్రవర్తించారు. ఆయన వద్ద ఉన్న సెల్‌ఫోన్ లాక్కొనే ప్రయత్నం చేశారు. ఎస్ఐ తీరుపై దళిత మహిళలు ఆందోళన వ్యక్తం చేశారు. ఇంతలో దళిత మహిళలు ఫిర్యాదు చేసిన వ్యక్తిని పోలీసులు తీసుకొచ్చి కేసు నమోదు చేయడంతో శాంతించి వెనుదిరిగారు. దళితుడు రాజారావు, జర్నలిస్టు మోహన్‌పై ఎస్ఐ వ్యవహరించిన తీరు సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న టిడిపి నాయకులు

బిసి డిక్లరేషన్‌ను స్వాగతిస్తున్నాం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

గుంటూరులో నిర్వహించిన ఇటీవల నిర్వహించిన జయహో బిసి సభలో చంద్రబాబు బిసి డిక్లరేషన్ ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నామని మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి పేర్కొన్నారు. అరసవల్లిలో తన నివాస గృహంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. టిడిపి ఆవిర్భావం నుంచి బిసిలకు అండగా నిలుస్తోందన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి అనేక మంది బిసి నాయకులను తయారు చేయడమే కాకుండా సుదీర్ఘ కాలం పాటు బిసిలకు రాజ్యాధికారంలో భాగస్వాములను చేసిందన్నారు. విద్య, ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో పెద్దపీట వేశారని అన్నారు. బిసి సబ్ ప్లాన్ కోసం ఏటా పెద్ద మొత్తంలో నిధులు కేటాయించామని చెప్పారు. అనంతరం చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు.

తూతూమంత్రంగా మండల సమావేశం

ప్రజాశక్తి- జి.సిగడాం

మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి మీసాల సత్యవతి అధ్యక్షతన బుధవారం నిర్వహించిన మండల సమావేశం తూతూమంత్రంగా సాగింది. పూర్తిస్థాయిలో సభ్యులు హాజరు కాలేదు. కొంత మంది వచ్చినా నామమాత్రంగా చర్చించి చేతులు దులుపుకున్నారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం మూడు నెలలకు ఒకసారి నిర్వహించాల్సిన మండల సమావేశానికి పూర్తిస్థాయిలో సభ్యులు హాజరు కాకపోవడం పలువురిని విస్మయానికి గురి చేసింది. సభ్యులు గైర్హాజరు కావడంతో ప్రజా సమస్యలను వివరించే నాయకులే కరువయ్యారు. ఇప్పటివరకు నిర్మించిన మండల సమావేశాల్లో చేసిన తీర్మానాలు, అవి అమలైన తీరు ఎవరికీ తెలియనీయలేదు. పంచాయతీ అభివృద్ధి నిధులు గురించి, పనులు గుర్తించి ప్రస్తావనే రాలేదు. ముందుగా తహశీల్దార్ ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ వచ్చే సార్వత్రిక ఎన్నిక ప్రశాంతంగా జరిగేటట్టు సహకరించాలని కోరారు. అలాగే ఇంతవరకు జరిగే భూ రీ సర్వేలో ఎటువంటి తప్పులు ఉన్నా మా దృష్టికి తీసుకొస్తే... వాటిని పరిష్కరిస్తామని తెలిపారు. భూ సర్వేకు గ్రామాల్లోని నాయకులందరూ సహకరించాలని కోరార. ఎంపిపి ప్రతినిధి మీసాల వెంకటరమణ మాట్లాడుతూ తప్పులు ఉన్న భూములను సరి చేయాలని కోరారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి కాయల రమణ, ఎంపిడిఒ వెంకన్నబాబు, విద్యుత్‌శాఖ ఎఇ తిరుపతిరావు, ఎపిఒ సత్యనారాయణ, పశు వైద్యాధికారి సుమన్, వైద్యాధికారులు ప్రతిష్టాశర్మ, సుమతి, ఐసిడిఎస్ అధికారి రజని, ఆర్‌టి నుంచి కృష్ణారావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న తహశీల్దార్ ఉమామహేశ్వరరావు

10న మన్యం బంద్

ప్రజాశక్తి- మెళియాపుట్టి

పెద్దమడిలో ర్యాలీ నిర్వహిస్తున్న గిరిజనులు

జిల్లాలో ఉన్న ఆదివాసీ నిరుద్యోగులు, ఆదివాసీ గిరిజనుల సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 10న జరిగే రాష్ట్ర వ్యాప్త మన్యం బంద్‌ను జయప్రదం చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి నిమ్మక అప్పన్న పిలుపునిచ్చారు. బుధవారం మండలంలో పెద్దమడి, హీరాపురం గ్రామాల్లో బంద్‌కు సంబంధించి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆదివాసీ నిరుద్యోగులను రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని, ఏజెన్సీ ప్రాంతానికి కేటాయించిన సుమారు 500 ఉపాధ్యాయ ఖాళీలను కూడా ఆదివాసీ గిరిజన నిరుద్యోగులకు ఇవ్వకుండా గిరిజనేతరులతో భర్తీ చేస్తామని చెప్పడం సిగ్గుచేటన్నారు. వెంటనే ఉపాధ్యాయ ఖాళీలన్నీ గిరిజన నిరుద్యోగులతోనే నింపాలన్నారు. మాతృ భాష వాలంటీర్లను మార్చి, ఏప్రిల్ నెలల వరకు కొనసాగించాలని, గిరిజనుల అటవీ ఉత్పత్తులకు కనీస మద్దతు ధర కల్పించాలన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కె.సూరయ్య చాణక్య, ఆదినారాయణ, కర్రమ్మ, గిరిజనులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

ప్రజాశక్తి- ఆమదాలవలస

33/11 కెవి సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కెవి టౌన్-1, ఫీడర్ పరిధిలోని గురువారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సత్తారు బయ్యన్నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకాకుళం నుంచి ఆమదాలవలస రోడ్డు వెడల్పు కారణంగా ఇరువైపులా విద్యుత్ స్తంభాలు వేయడం, తీగలను మారుస్తున్నామని అన్నారు. ఉదయం 10.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు చింతాడ, నందగిరిపేట, సనపలవానిపేట, నాదానపురం తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని పేర్కొన్నారు. ఈ అసౌకర్యాన్ని వినియోగదారులు గమనించి విద్యుత్‌శాఖ సిబ్బంది సహకరించాలని కోరారు.

ల్యాండ్ టైట్లింగ్‌పై స్పష్టత ఇవ్వాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రాష్ట్రంలో రెవెన్యూ విధాన నిర్ణయాలు రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు పాత్ర ఏంటో ప్రజలకు చెప్పాలని, ఆయన చెపుతున్న మాటలకు, ముఖ్యమంత్రి సలహాదారు అజేయ కల్లాంరెడ్డి చెప్పిన మాటలకు పొంతన లేదని మాజీ మంత్రి గుండ అప్పలసూర్యనారాయణ వ్యాఖ్యానించారు. అరసవల్లిలోని ఆయన స్వగృహంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. భూహక్కుదార్లకు నష్టం వాటిల్లే రీతిలో ఎపి ల్యాండ్ టైటిలింగ్ భూ హక్కు చట్టాన్ని ప్రభుత్వం తీసుకొచ్చిందని అన్నారు. భూ హక్కులు కాపాడే విషయంలో సివిల్ కోర్టులను కాదని రెవెన్యూ అధికారులకు అధికారాలు కట్టబెట్టడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. రైతులు, న్యాయవాదులు ఈ చట్టాన్ని రాష్ట్ర వ్యాప్తంగా వ్యతిరేకిస్తూ.. ఆందోళన చేస్తున్నారని అన్నారు. రెవెన్యూ మంత్రి ధర్మాన మాత్రం ఈ చట్టం అమలు చేయడం ఇప్పుడు కాదని, భూ సర్వే పూర్తి చేసిన తర్వాత చర్యలు తీసుకుంటామని చెప్పడం విడ్డూరంగా ఉందని అన్నారు. కబ్జాదారులకు భూ టైటిలింగ్ యాక్టు ద్వారా సహకారం అందిస్తున్నారన్నారు. దీనిపై అవగాహన ఉంటే మంత్రి స్పష్టత ఇవ్వాలని కోరారు.

అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

టెక్కలి : అగ్ని ప్రమాదాలు సంభవించేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకుని మెళకువలు పాటిస్తే ప్రమాదాల నుంచి నివారణ పొందవచ్చునని టెక్కలి అగ్నిమాపక అధికారి కె.మధుసూదనరావు అన్నారు. మండలం చిన్ననారాయణపురంలో టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల జాతీయ సేవాపథకం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిబిరాన్ని బుధవారం సందర్శించి అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. పిఒ కంది గోల్ల ఆధ్వర్యంలో చేపడుతున్న ఈ శిబిరంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబురు గోవిందమ్మ, వాసుబాబు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బేపల సతీష్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

అమరావతిలో 'మన కలిశెట్టి ఎచ్చెర్ల భవన్'

ప్రారంభిస్తున్న అప్పలనాయుడు

ప్రజాశక్తి- రణస్థలం

రాష్ట్ర రాజధాని అమరావతికి వివిధ పనులపై తరలివచ్చే ఎచ్చెర్ల నియోజవర్గ ప్రజానీకానికి రోయల్ సర్వీస్ అపార్ట్‌మెంట్ హాస్టల్స్, మోకా రెసిడెన్సి, చిన్మయ ధ్యాన మందిర్ పక్కన, కరెన్సీ నగర్, రామవరప్పాడు రింగ్ రోడ్డు దగ్గర భోజనం, వసతి సౌకర్యం కల్పిచేందుకు మన కలివెట్టి ఎచ్చెర్ల భవన్‌ను బుధవారం ఏర్పాటు చేశామని టిడిపి నాయకులు, ఉత్తరాంధ్ర టిడిపి శిక్షణా శిబిరం మాజీ డైరెక్టర్ కలిశెట్టి అప్పలనాయుడు తెలిపారు. తమతమ పనులపై రాష్ట్ర రాజధాని అమరావతికి తరలివచ్చే ఎచ్చెర్ల నియోజవర్గ ప్రజానీకానికి ప్రత్యేకించి భోజనం, వసతి సౌకర్యాలు కల్పించేందుకు ఈ భవనం ప్రారంభించామని అన్నారు. అమరావతిలోని సెక్రటేరియట్ (సచివాలయం)లో పనులతో పాటు విద్య, వైద్యం, దైవ దర్శనం తదితర అనేక పనులపై విచ్చేసే ఎచెర్ల నియోజకవర్గ ప్రజలకు భోజనం, వసతి సౌకర్యాలను కల్పిస్తామని అన్నారు. ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రోజూ మూడు పూటలా భోజనం, వసతి సౌకర్యం ఉంటుందని అన్నారు. ఒకేసారి వంద మందికి భోజనం, వసతి సౌకర్యాలు కల్పించే సామర్థ్యాన్ని కల్పించామన్నారు.

విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ అవసరం

నౌపడ : విద్యార్థి దశనుంచే ఆర్థిక క్రమశిక్షణ ప్రతిఒక్కరూ అలవర్చుకోవాలని స్టేట్‌బ్యాంక్ అధికారులు కోరారు. సంతబొమ్మాలి మండలం మూలపేట మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులు, గ్రామస్తులకు ఆర్థిక అక్షరాస్యతపై బుధవారం అవగాహన సదస్సును నిర్వహించారు. నౌపడ స్టేట్ బ్యాంక్ ఆధ్వర్యంలో రాజమండ్రి మ్యుజిసిఎన్ బృందం బీమా, రుణ సదుపాయాలు, నగదు రహిత లావాదేవీలు, ఆర్థిక మోసాలపై అవగాహన కల్పించారు. అనంతరం పాత పోలీస్ స్టేషన్ వీధిలో పలు డ్వాక్రా సంఘాలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ ఎస్.మధుసూదనరావు, ఫీల్డ్ ఆఫీసర్ దశరథ, బాలరాజు, హెచ్ఎం రామారావు, సిఎఫ్‌లు, ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

15న సైబర్ క్రైమ్‌పై అవగాహనా సదస్సు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

సైబర్ నేరాల గురించి ప్రజల్లో పెద్ద ఎత్తున అవగాహన కల్పించేందుకు ఆసరా సంస్థ ఆధ్వర్యాన ఈ నెల 15న ఎచ్చెర్ల డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విశ్వవిద్యాలయం మీటింగ్ హాల్లో అవగాహనా సదస్సు నిర్వహిస్తున్నట్టు ఆ సంస్థ ప్రతినిధులు డాక్టర్ గంజి ఎజ్రా, గేదెల ఇందిరాప్రసాద్ ఎస్.జోగినాయుడు తెలిపారు. ఈ మేరకు ఆర్ట్స్ కళాశాలలో స్టార్ వాకర్స్ ఆధ్వర్యాన బుధవారం బ్రోచర్‌ను ఆవిష్కరించారు. 15న ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. రోజురోజుకూ పెరుగుతున్న సైబర్ నేరాల అదుపు చేసేందుకు తమ వంతు కృషి చేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో స్టార్ వాకర్స్ క్లబ్ ప్రతినిధులు పి.జి.గుప్తా, నాగేశ్వర ఈశ్వరరావు, గేదెల అప్పలనాయుడు, జి.లక్ష్మి, వసంతలక్ష్మి, రాంబాబు, సావిత్రి పాల్గొన్నారు.

లారీ ఢీకొని ఆర్‌పిఎఫ్ కానిస్టేబుల్ మృతి

ప్రజాశక్తి- ఆమదాలవలస

ముకుందరావు (ఫైల్)

మండలం వంజంగి గ్రామ సమీపంలో శ్రీకాకుళం-ఆమదాలవలస ప్రధాన రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆర్‌పిఎఫ్ కానిస్టేబుల్ చింతాడ ముకుందరావు (52) లారీ ఢీకొని మృతి చెందాడు. శ్రీకాకుళం రోడ్ రైల్వేస్టేషన్‌లో విధులు ముగించుకొని తన స్వగ్రామమైన ఎచ్చర్ల మండలం కుశాలపురం గ్రామానికి వెళ్తున్న క్రమంలో విశాఖ డైరీ ఫీడ్ ను తీసుకువెళ్లే లారీ శ్రీకాకుళం నుంచి వస్తున్న క్రమంలో బైక్‌ను ఢీకొంది. దీంతో తీవ్ర గాయాలు పాలైన ముకుందరావు సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు.

యువకుడు అరెస్టు

లావేరు : మండలంలోని పెదరావుపల్లి పంచాయతీ యాతపేటకు చెందిన పెంటిమాని వేణుగోపాల్‌ను జెఆర్ పురం సిఐ జె.రామచంద్రరావును బుధవారం అరెస్ట్ చేసి కోర్టుకు తరలించినట్లు ఎస్ఐ సిహెచ్ స్వామినాయుడు తెలిపారు. వేణుగోపాల్ ఈనెల 4న అదే గ్రామంలో పంట పొలానికి నీరు పెడుతున్న ఓ మహిళపై హఠాత్తుగా దాడి చేసి హత్యచారానికి పాల్పడటంతో మహిళా ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి అరెస్ట్ చేసినట్లు చెప్పారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

ఇచ్ఛాపురం: గర్భిణులు హెచ్ఐవి పరీక్షలు కచ్చితంగా చేయాలని ఫెఫర్ స్టేట్ కో-ఆర్డినేటర్ డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ వైద్యాధికారులకు, సిబ్బందికి సూచించారు. బుధవారం కమ్యూనిటీ ప్రభుత్వ ఆస్పత్రిలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఆస్పత్రిలో ఐసిటిసి రికార్డులు పరిశీలించారు. గర్భిణీలకు ప్రత్యేకంగా పరీక్ష చేయాలన్నారు. హెచ్ఐవి ఉన్నవారికి ఎఆర్‌టి మందులు వాడడం, టిబిపై వివరించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ దేవేంద్ర రెడ్డి, ఐసిటిఎస్ కౌన్సిలర్ రాజశేఖర్, అమ్మి నాయడు, నాగ భూషణం, మాధవరావు పాల్గొన్నారు.

కిట్లు పంపిణీ చేస్తున్న ఎంఎల్‌హెచ్‌పి

వైఎస్ఆర్ కిట్లు పంపిణీ

బూర్జ: మండలం మామిడివలస పంచాయతీ పరిధి కాఖండ్యాం అంగన్వాడీ కేంద్రం వద్ద బుధవారం విద్యార్థులకు వైఎస్ఆర్ కిట్లును పంపిణీ చేశారు. ప్రభుత్వం పిల్లలకు, బాలింతలకు, గర్భిణీల కోసం పౌష్టికాహారాన్ని అందించేందుకు చర్యలు చేపట్టిందని, ఇందులో భాగంగానే వీటిని అందిస్తున్న ఎంఎల్‌హెచ్‌పి అలేఖ్య అన్నారు. ప్రతిఒక్కరు పిల్లలకు పౌష్టికాహారాన్ని అందించడం వలన వారిలో రోగనిరోధక శక్తిని పెంపొందించడమే కాకుండా వ్యాధులకు దూరంగా ఉంటారని తెలిపారు. గర్భిణీలు, బాలింతలు క్రమం తప్పకుండా ఈ పౌష్టికాహారాన్ని తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎఎన్ఎం లత, అంగన్వాడీ కార్యకర్త వరలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న ఈశ్వరమ్మ తదితరులు

స్త్రీ, పురుష సమానత్వానికి పోరాడుదాం

ప్రజాశక్తి- పలాస

మహిళలు తమ హక్కుల కోసం స్ఫూర్తితో పోరాడాలని, స్త్రీ, పురుష సమానత్వం సాధించాలని ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు ఈశ్వరమ్మ పిలుపునిచ్చారు. బుధవారం సూది కొండలో ర్యాలీ నిర్వహించారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపికి మద్దతిస్తున్న ప్రాంతీయ పార్టీల అభివృద్ధి నిరోధకమైనవన్నారు. మహిళలు పని స్థలాల్లో అనేక వేధింపులకు గురవుతున్నారని, పురుషులతో సమానంగా పనిచేసినా సమాన వేతనం ఇవ్వడం లేదని, స్త్రీ పురుషులకు సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సుందరమ్మ, కంప సరస్వతి, కె.సుహాసిని, గౌరమ్మ పాల్గొన్నారు.

నేడు ఆశీల బహిరంగ వేలం

ఆమదాలవలస : పురపాలక సంఘం నందు గురువారం సాయంత్రం నాలుగు గంటలకు ఆశీలు బహిరంగ వేలం పాటలు నిర్వహించబడునని మున్సిపల్ కమిషనర్ జి.రవి ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25ఆర్థిక సంవత్సరానికి మార్కెట్, చింతాడ వారపు సంత, కమేళ ఆశీలు వసూలు చేసుకునే హక్కు పొందుటకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు.

సచివాలయం ప్రారంభం

ప్రజాశక్తి- లావేరు

వైసిపి, సిఎం జగన్మోహన్ రెడ్డితోనే రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ అన్నారు. బుధవారం తాళ్లవలస, కొత్తకుంకం గ్రామ సచివాలయలు, రైతు భరోసా కేంద్రం నూతన భవనాలను ఆయన ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ సచివాలయం వ్యవస్థ దేశానికే తలమానికంగా నిలుస్తోందన్నారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి రొక్కం బాలకృష్ణ, జెడ్‌పిటిసి ఎం.సీతంనాయుడు, జెసిఎస్ ఇన్‌ఛార్జి మీసాల శ్రీనువాసరావు, సర్పంచ్ దేశెట్టి తిరుపతిరావు, ఎంపిడిఒ ఎస్.కొండలరావు, గొర్లె అప్పలనాయుడు, ఎంపిటిసి చిరంజీవి పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న విసి రజని

అన్నిరంగాల్లో ముందుండాలి

ఎచ్చెర్ల : వైబ్రేంట్ విస్టా 2కె 24'పేరిట డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాల నిర్వహించిన రెండు రోజుల టెక్ ఫెస్ట్ బుధవారం ముగిసింది. ముగింపు వేడుకగా 'ఫ్లాష్ మాబ్' డాన్స్‌లతో విద్యార్థులు అలరించారు. యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య కె.ఆర్.రజిని వీటిని తిలకించి విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డా. సిహెచ్. రాజశేఖరరావు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందిస్తున్న ఎమ్మెల్యే

అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు కృషి

ప్రజాశక్తి- రణస్థలం

లావేరు మండలం గుమ్మడాం పంచాయతీ వేణుగోపాలపురం ఎస్‌సి కాలనీ యువత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహ నిర్మాణం కొరకు ఆర్థికసాయం చేయాలని ఎమ్మెల్యే కిరణ్‌కుమార్‌ను కోరారు. దీనిలో భాగంగా బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రూ.20 వేలు ఆర్థిక సాయాన్ని ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ వారికి అందజేశారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు రేగిడి లక్ష్మణరావు, వేణుగోపాలపురం గ్రామ ఎస్‌సి కాలనీ గ్రామ పెద్దలు, యువత పాల్గొన్నారు.

విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

వైఎస్ఆర్ విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

మండలంలోని రుంకు హనుమంతుపురంలో నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, వైసిపి ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్ మాజీ సిఎం వై.ఎస్.రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైఎస్ఆర్ పేదలకు అనేక సంక్షేమ పథకాలు అందించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో డిసిసిబి ఛైర్మన్ కరిమి రాజేశ్వరరావు, వైసిపి మండల పార్టీ అధ్యక్షులు జీరు బాబూరావు, వైసిపి మహిళా అధ్యక్షులు జోగి రాములమ్మ, పిఎసిఎస్ డైరెక్టర్లు పిలక రవికుమార్, మార్పు నాగభూషణరావు, నక్క భీమారావు, పి.రామకృష్ణ, సతీష్, లక్ష్మయ్య పాల్గొన్నారు.

మాట్లాడుతున్న టిడిపి నాయకులు

శిరీషపై మీడియా ఆందోళన తగదు

ప్రజాశక్తి- పలాస

టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీషపై పలాస మీడియా ఆందోళన తగదని ఆ పార్టీ అధికార ప్రతినిధి తలగాన నర్సింహమూర్తి, మండల పార్టీ కార్యదర్శి సంతోష్ కుమార్ నాయుడు, తిమడాన శంకర్, ముురిపింటి కుమార్ రాజా అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. కొంత మంది మీడియా అధికార పార్టీకార్యకర్తలు మాదిగా వ్యవహరిస్తూ... శిరీషపై విషప్రచారాన్ని చేస్తున్నారని అన్నారు. దీన్ని ప్రశ్నిస్తే మీడియాపై దాడులా అంటు రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తమ పార్టీ మీడియాపై మంచిగానే ఉన్నామని, ఫేక్ పోస్టింగులు పట్టుకొని తమ నాయకులపై ప్రచారం చేయడం తగునా? అని ప్రశ్నించారు. లక్ష్మీపురంలో ఓ ప్రధాన టివి విలేకరిపై వైసిపి నాయకులు దౌర్జన్యానికి దిగారని, సాక్ష్యాత్తు మంత్రి సమక్షంలోనే ఇద్దరు మీడియా మిత్రులపై ఆయనే దురుసుగా వ్యవహరించారని, నిత్యం సిఎం నుంచి కిందిస్థాయి కార్యకర్త వరకూ మూడు ప్రధాన మీడియా సంస్థలపై విషయం చిమ్ముతున్నా ఆందోళన చేస్తున్నా విలేకరులకు కనిపించడం లేదని ప్రశ్నించారు.

సమావేశంలో మాట్లాడుతున్న తిరుపతిరావు

దారితప్పిన 'దానేటి' మాటలు

ప్రజాశక్తి- పలాస

రాజకీయాల్లో దారి తప్పి తిరుగుతున్న డాక్టర్ దానేటి శ్రీధర్ ఉద్దానం కిడ్నీ ఆస్పత్రిపై అసత్య ప్రచారం చేస్తున్నారని మండల వైసిపి ప్రధాన కార్యదర్శి సొర్రా తిరుపతిరావు విమర్శించారు. మండలంలోని నీలావతిలో బుధవారం విలేకరులతో మాట్లాడుతూ జనసేన పంచకు చేరిన దానేటికి పవన్ కళ్యాణ్ పద్ధతులు వచ్చాయని ఎద్దేవా చేశారు. ఇటీవల నీలావతిలో జరిగిన జనసేన, టిడిపి ఉమ్మడి సమావేశానానికి దానేటి హాజరై మైకు ఇచ్చారని ఉద్దానం కిడ్నీ ఆస్పత్రిపై అక్కసు కక్కారన్నారు. గంటకో మాట, పూటకో పార్టీలో చేరిన ఆయన టికెట్ కరువులో ఉండి అరువు మాటలు మాట్లాడుతున్నారన్నారు. నీలావతి సభలో మాట్లాడిన మాటలను వెనక్కు తీసుకోకపోతే తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. సమావేశంలో మాజీ సర్పంచ్ బొడ్డు సుధాకర్, ఎంపిటిసి మద్దిల పాపారావు, జిల్లా యువజన కార్యదర్శి జినగ సీతారాం, జిల్లా బోర్డ్ మెంబర్ దేవరకొండ షన్ముఖరావు, మమిడిమెట్టు సర్పంచ్ ప్రతినిధి గేదెల సూర్య పాల్గొన్నారు.

గోకర్ణపల్లిలో నిర్వహిస్తున్న పోలీసుల కవాతు

వివాదాల జోలికి పోవద్దు

ప్రజాశక్తి- పొందూరు

వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వివాదాల జోలికి పోయి తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని ఎస్ఐ వై.రవికుమార్ సూచించారు. మండలంలోని అత్యంత సమస్యాత్మక గ్రామమైన గోకర్ణపల్లి, రంగనాథపేట గ్రామాల్లో స్పెషల్ ఫోర్స్ పోలీసులతో బుధవారం వీధుల్లో కవాతును నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమస్యాత్మక గ్రామాలు కాబట్టి ఇక్కడ ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేశామని అన్నారు. వచ్చే ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని, ప్రధానంగా యువత ఎన్నికల సందర్భంగా ఎటువంటి అల్లర్లకు పాల్పడినా తమ బంగారు భవిష్యత్ నాశనం అవుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎఎస్ఐ సువ్వారి రామచంద్రరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కెజిబివిలో పోషణ పక్వాడా

ప్రజాశక్తి- జి. సిగడాం

బాలికలు తమ హక్కులపై అవగాహన కలిగి ఉండాలని ఎంపిడిఒ వెంకన్నబాబు అన్నారు. బుధవారం స్థానికి కెజిబివి పాఠశాలలో పోషణ పక్వాడా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలురతో సమానంగా బాలికలకు సమాన హక్కులు ఇవ్వాలన్నారు. అన్ని రంగాల్లో బాలికలు ముందుండాలన్నారు. విద్య, క్రీడలు, ఉద్యోగకల్పన తదితర అంశాల్లో బాలురతో పాటు బాలికలకు సమాన అవకాశాలను అందించాలన్నారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి ఉషా రత్నకుమారి, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ రజిని, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

టిడిపి సూపర్ సిక్స్‌పై ప్రచారం

సోంపేట : ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అశోక్

ప్రజాశక్తి- సోంపేట

పట్టణంలోని డాబా కాలనీ, రేకుల కాలనీ వీధిలో బుధవారం స్థానిక ఎమ్మెల్యే అశోక్ నాయకులతో కలిసి ప్రచారం నిర్వహించారు. మాజీ సిఎం చంద్రబాబు నాయుడు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను పోస్టర్ల పంపిణీ చేసి వివరించారు. రానున్న ఎన్నికల్లో చంద్రబాబును సిఎంగా గెలిపించాలని కోరారు. అంతకు ముందు నూకాలమ్మ దేవాలయాన్ని దర్శించుకున్నారు. కార్యక్రమంలో చిత్రాడ శేఖర్, డి.మధు, రెళ్ల శ్రీను పాల్గొన్నారు.

బూర్జ: మండల కేంద్రమైన బూర్జలో బుధవారం టిడిపి సూపర్ సిక్స్ పథకాలకు సంబంధించిన పోస్టర్లను పార్టీ నాయకులు వడ్డాది భోగారావు ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్యకర్తలు బొంబాయి శ్రీను, సూరి అనంతగిరి, ఎంపిటిసి పోలినాయుడు, బంగారి శ్రీధర్, జగదీష్, శ్రీను పాల్గొన్నారు.

జి.సిగడాం : టిడిపి అధినేత చంద్రబాబుతోనే స్వర్ణాంధ్రప్రదేశ్ నిర్మాణం సాధ్యమని మండల అధ్యక్షుడు కుమరావు రవికుమార్, మాజీ పిఎసిఎస్ అధ్యక్షుడు కూనుబిల్లి కూర్మారావు అన్నారు. బుధవారం పెంట, బాతువ, డిఆర్ వలస, దవళపేట గ్రామాల్లో బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి, జనసేన నాయకులు కంచరాన సూరన్నాయుడు, మీసాల విజయమ్మ, కోనారి సత్యన్నారాయణ, సిరిపురపు ఉపేంద్ర, కోరాస సంతోషకుమార్, మీసాల అశోక్, అప్పారావు, నేదూరి సురేష్, దర్గాప్రసాద్ పాల్గొన్నారు.

బూర్జ : పోస్టర్లను పంపిణీ చేస్తున్న టిడిపి నాయకులు

టెక్కలి: సూపర్ సిక్స్ ద్వారా అమలు చేసే పథకాల ద్వారానే సంక్షేమం సాధ్యమవుతుందని టిడిపి మండల అధ్యక్షులు బగాది శేషగిరి అన్నారు. ప్రచారంలో భాగంగా బుధవారం సన్యాశి నీలాపురం, సవరకిల్లి గ్రామాల్లో ఇంటింటా ప్రచారం చేపట్టి పోస్టర్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు హనుమంతు రామకృష్ణ, మామిడి రాము, పోలాకి షణ్ముఖరావు, కొళ్ల లవకుమార్, కోళ్ల కామేష్ పాల్గొన్నారు.

రేపు 'చేయూత' సమావేశం

ప్రజాశక్తి- పోలాకి

ఈ నెల 8న నిర్వహించనున్న వైఎస్ఆర్ చేయూత సమావేశం విజయవంతం చేయాలని ఎంపిపి ప్రతినిధి ముద్దాడ బైరాగినాయుడు సూచించారు. బుధవారం వెలుగు కార్యాలయంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, జెడ్‌పిటిసి ధర్మాన కృష్ణచైతన్య పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు ఆర్.త్రినాథరావు, జడూరు సర్పంచ్ అసిరి తాత, ఎపిఎం జి.రాజారావు, సిసిలు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ మన బాధ్యత

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

పర్యావరణ పరిరక్షణ మన అందరి బాధ్యత అని, మొక్కలను విరివిగా నాటి పర్యావరణాన్ని కాపాడుదామని ఉద్దానం హెల్పింగ్ సొసైటీ అధ్యక్షుడు కీలు విజయ్ కుమార్ అన్నారు. మండలంలోని ఉద్దానం మెళియాపుట్టిలో బత్తినితిరుపతి, కర్ని లింగరాజు, మల్లెన నేతాజీలు బుధవారం మొక్కలను నాటారు. చెట్లను విచ్చలవిడిగా నరికేయడం వల్ల పర్యావరణ సమతుల్యత దెబ్బ తింటుందని, మొక్కలు నాటడమే పరిష్కారమని అన్నారు. ప్రకృతి సంపదను నాశనం చేస్తే మానవాళి మనుగడ ప్రశ్నార్థకం కానుందని ఆందోళన వ్యక్తం చేశారు. మొక్కలు పెంపకంపై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో ఉద్దానం హెల్పింగ్ సొసైటీ సభ్యులు ఎం.మల్లేశ్వరరావు, సింహాచలం, ఈశ్వరరావు, ఢిల్లీరావు, తాతారావు, తరుణ్, అప్పారావు, వీరాస్వామి, కామరాజు, సాయి, గణేష్, నవీన్, మహేష్ పాల్గొన్నారు.

హక్కులపై అవగాహన

కొత్తూరు: స్థానిక వెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో హ్యాబిటెట్ అండ్ రికార్డ్స్ ఆఫ్ రైట్స్‌పై అటవీ హక్కుల కమిటీ సభ్యులకు అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వెలుగు కార్యదర్శి సంజీవరావు మాట్లాడుతూ అటవీ హక్కులచట్టం 2006 ప్రాప్తికి వ్యక్తిగత హక్కులు పొందడం జరిగిందని, వ్యక్తి గత హక్కులు ప్రభుత్వ రికార్డుల్లో నమోదు చేసుకుంటే కలిగే ఉపయోగాలు, రికార్డుల్లో నమోదు చేయకపోతే కలిగే నష్టాలను వివరించారు. అటవీ హక్కుల కమిటీ బలోపేతం, కమిటీల విధులు, భాద్యతలపై శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణలో కొత్తూరు, భామిని, సీతంపేట, పాతపట్నం, మెలియాపుట్టి మండలాల నుంచి 70మంది అటవీ హక్కుల కమిటీ సభ్యులు పాల్గొన్నారు. రిసోర్స్ పర్సన్లుగా చిరంజీవిరావు, ఎ.నాగరాజు పాల్గొన్నారు.

క్రీడాభివృద్ధికి కృషి

పోలాకి : ప్రభుత్వం ఎల్లప్పుడూ క్రీడలు, క్రీడాకారుల అభివృద్ధికి కృషి చేస్తుందని జెడ్‌పిటిసి ధర్మాన కృష్ణదాస్ అన్నారు. బుధవారం మండలంలో గుప్పిడిపేట, గుల్లవానిపేటలో క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. అదే విధంగా క్రీడామైదానం ఏర్పాటుకు ఎమ్మెల్యే సొంత నిధులు అందజేశారు. ఈ సందర్భంగా స్థానిక యువకులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి ముద్దాడ బైరాగినాయుడు, నాయకులు లండ యర్రయ్య, ఎంపిటిసి పైడమ్మ పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు తోడ్పాటు

సోంపేట: అమ్మ తెన్నే ఫౌండేషన్ ద్వారా నిరుపేద విద్యార్థులకు తోడ్పాటు అందిస్తామని వ్యవస్థాపకుడు దుప్పట్ల సురేష్ అన్నారు. ఆంగ్లంలోని ఉన్నత పాఠశాల విద్యార్థులకు బుధవారం పరీక్షలకు అవసరమైన అట్టలు, పెన్నులు ఇతర సామాగ్రిని అందజేశారు. సురేష్ వికాస్ బ్యాంకులో క్యాషియర్‌గా పనిచేస్తున్నారు. తాను నిరుపేద కుటుంబం నుంచి వచ్చానని కష్టపడి చదివి ఈ స్థాయికి వచ్చానన్నారు. రానున్న పదో తరగతి పరీక్షల్లో అన్ని సబ్జెక్టుల్లో 98 శాతం మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రత్యేకమైన ప్రోత్సాహకాలను అందజేస్తానన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

రేపట్నుంచి 'క్రెడాయ్ ఎక్స్‌పో'

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రియల్టర్ల వ్యాపారాభివృద్ధితో పాటు నిర్మాణ రంగాన్ని బలోపేతం చేసేందుకు ఈ నెల 8 నుంచి 10 వరకు క్రెడాయ్ ఎక్స్‌పో నిర్వహిస్తున్నట్టు ఆ సంస్థ జిల్లా అధ్యక్షులు బి.రమేష్‌చక్రవర్తి, కార్యదర్శి అదీప్‌రెడ్డి, ఉపాధ్యక్షులు దుంగ సుధాకర్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని ఆనందమయి ఫంక్షన్ హాల్లోలో ఎక్స్‌పో 2024 ప్రోపర్టీ షో బిల్డ్ టెక్ నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. నగరంలో ఈ షో మొట్టమొదటి సారి నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ షోలో దాదాపు 50 స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నట్టు వివరించారు. వినియోగ దారుల ఆర్థికస్తోమతను బట్టి ప్రాపర్టీ షోలో సరియైన నిర్ణయం తీసుకుని పెట్టుబడి పెట్టేందుకు అనుకూలమైన వాతావరణాన్ని కల్పిస్తున్నామన్నారు. మూడు రోజులు పాటు జరిగే ఈ కార్యక్రమంలో బిల్డర్స్, లైసెన్స్ సర్వేయర్స్, రియల్ ఎస్టేట్ వ్యాపారులు పాల్గొంటున్నట్టు తెలిపారు. రోజూ ఉదయం 10 నుంచి రాత్రి 8.30 గంటల వరకు ప్రజలు సందర్శిచవచ్చున్నారు. స్టాల్స్ సందర్శించడానికి ఎటువంటి రుసుం చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. ఈ అవకాశాన్ని నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో క్రెడాయ్ జిల్లా ట్రెజరర్ కోరాడ సత్యారావు, కమిటీ సభ్యులు గంజి భీమారావు, పొట్నూరు భాస్కరరావు, డోల బాలవంశీ మురళీకృష్ణ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రమేష్ చక్రవర్తి

వైసిపిలో వికలాంగులకు అన్యాయం

ధర్నా చేస్తున్న వికలాంగులు

శ్రీకాకుళం అర్బన్ : వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వికలాంగులకు తీరని అన్యాయం చేశారని, వికలాంగుల సంక్షేమ శాఖను నిర్వీర్యం చేశారని టిడిపి వికలాంగుల విభాగం జిల్లా అధ్యక్షులు గురుగుబిల్లి రమణమూర్తి ఆరోపించారు. నగరంలోని టిడిపి జిల్లా కార్యాలయం సమీపాన వికలాంగులు బుధవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంగవైకల్యం ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందకుండా కుటుంబంలో ఒకరికి మాత్రమే పథకాలను వర్తింప జేస్తున్నారని అన్నారు. గత ప్రభుత్వాలు ఏనాడూ ఇటువంటి నిబంధనలు విధించలేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వ విధానాలతో సింగిల్ పర్సన్స్ రేషన్ కార్డులను రద్దు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. వివాహ భృతి గత 20 ఏళ్లగా అమలులో ఉండేదని, 2019 అక్టోబరు నుంచి ఈ పథకాన్ని రద్దు చేశారని అన్నారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు పి.ఎం.జె.బాబు, సంఘం సభ్యులు ఉణ్ణ సాయికుమార్, కార్యదర్శి గుడ్ల అప్పలరాజు, అనురాధ, భాగ్యవతి, రామలక్ష్మి, పి.మోహన్, ఆదినారాయణ, పేరయ్య, గోవిందరావు, ఆర్.కేశవరావు, కె.సూరిబాబు, కె.హేమ, కె.శ్యామల పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో చదవాలి

ప్రజాశక్తి- ఆమదాలవలస

విద్యార్థులు క్రమశిక్షణతో ప్రణాళిక బద్ధంగా చదివితే పరీక్షల్లో మంచి మార్కులు సాధించవచ్చునని జెడ్‌పిటిసి బెండి గోవిందరావు, ఎంపిపి ప్రతినిధి తమ్మినేని శ్రీరామమూర్తి అన్నారు. బుధవారం మండలంలోని తొగరాం జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల పదోతరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సమావేశానికి పాఠశాల హెచ్ఎం ఎం.పోలినాయుడు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా శ్రీరామమూర్తి మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో మెలిగినప్పుడే విద్యలో రాణిస్తారన్నారు. పరీక్షలు బాగారాసి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలన్నారు. ఈ సందర్భంగా గత విద్యా సంవత్సరం 10వ తరగతిలో మొదటి, రెండవ స్థానం సాధించిన విద్యార్థులకు, ఈ ఏడాది 3 తరగతి నుంచి పదో తరగతి వరకు వివిధ పోటీ పరీక్షల్లో ప్రతిభ చూపి మొదటి, రెండవ స్థానం సాధించిన విద్యార్థులకు పాఠశాల స్వర్ణోత్సవ కమిటీ పక్షాన నగదు బహుమతులను అందించారు. అదేవిధంగా ఈ సంవత్సరం పదవ తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు స్వర్ణోత్సవ కమిటీ వారు అట్టలతో సహా ఎగ్జామినేషన్ కిట్టును అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బొడ్డేపల్లి సురేష్, పేడాడ కృష్ణారావు, పూర్వ ప్రధానోపాధ్యాయులు ఎన్. కృష్ణ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న శ్రీరామ్మూర్తి

ఇంటింటికీ సంక్షేమం

గ్రామస్తులతో మాట్లాడుతున్న వైసిపి నాయకులు

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

సిఎం జగన్మోహన్‌రెడ్డిని మళ్లీ సిఎంగా గెలిపించుకు ందామని ఎంపిపి రోణంకి ఉమామల్లేశ్వరరావు, పిఎసిఎస్ అధ్యక్షుడు బాడాన మురళి, మండల పార్టీ అధ్యక్షుడు నూక సత్యరాజు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం మండలం కురుడు పంచాయతీలో సర్పంచ్ కోత చిన్నారావు, రొక్కం సూర్యప్రకాష్ ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి ఎమ్మెల్యేగా దువ్వాడ శ్రీనివాస్, పార్లమెంట్ అభ్యర్థిగా పేరాడ తిలక్‌కు గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు కవిటి రామరాజు, గడ్డవలస నాగభూషణరావు, బొడ్డు అప్పన్న, నేతింటి అప్పలస్వామి, సంపతిరావు వెంకటరమణ, బలగ సూర్యారావు ఉన్నారు. అంతకు ముందు సచివాలయ అధికారులు, సిబ్బందితో మాట్లాడారు. అలాగే కురుడు జిల్లా పరిషత్ పాఠశాలలో మధ్యాహ్నభోజన పథకాన్ని పరిశీలించారు.

టెక్కలి నియోజకవర్గంలో ఉన్న దళితులంతా వైసిపికే మద్దతుగా ఉన్నారని నియోజకవర్గ దళిత నాయకులు అన్నారు. బుధవారం వంశధార పాఠశాలల అవరణలో దళిత ఐక్యవేదిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళితులకు ఎమ్మెల్సీ, టెక్కలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి, పార్లమెంట్ ఇన్‌ఛార్జిలు భరోసా కల్పిస్తే మరింత కష్టపడి పనిచేస్తామన్నారు. కార్యక్రమంలో మేజరు పంచాయతీ సర్పంచ్ కాళ్ల సంజీవరావు, కురుడు ఎంపిటిసి చుక్కా లోకనాథం, చింతాడ చిన్నారావు, తోట సింహాచలం, బొంతల కృష్ణ పాల్గొన్నారు.

పలువురికి ఆర్థికసాయం

ప్రజాశక్తి- శ్రీకాకుళం

ఈ ఏడాది జనవరి నెలలో విశ్రాంత హోంగార్డు అప్పారావుకు ఎస్‌పి జి.ఆర్.రాధిక సహ ఉద్యోగులు సమకూర్చిన నగదు చెక్కును అందజేశారు. జిల్లా హోంగార్డు విభాగంలో విధులు నిర్వహిస్తూ కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్‌లో పనిచేసి జనవరి నెలలో కొవ్వూరు అప్పారావు ఉద్యోగ విరమణ పొందారు. ఆయనను బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా యూనిట్‌లో పనిచేస్తున్న హోంగార్డులు అందరూ ఐకమత్యంతో తోటి ఉద్యోగికి సహాయ పడాలని మంచి ఆలోచనతో సమకూర్చిన సుమారు రూ.4.22 లక్షల నగదు చెక్కును అందజేసి ఆయన సేవలను కొనియాడారు. ఈ నగదును అవసరం మేరకే ఉపయోగించుకోవాలని సూచిస్తూ... ఆరోగ్యంగా ఉండాలని అన్నారు. కార్యక్రమంలో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ డి.సురేష్ పాల్గొన్నారు.

కొత్తూరు: స్థానిక బిసి కాలనీకి చెందిన వాడవలస లక్ష్మి నారాయణ, మోహిని దంపతులు, ముగ్గురు ఆడ పిల్లలతో హైదరాబాద్‌లో ఉండేవారు. పనిచేస్తున్న ప్రదేశంలో కరెంట్ షాక్ కొట్టడంతో భార్యాభర్తలిద్దరూ తీవ్రంగా గాయపడి, ఇంటికే పరిమితమయ్యారు. సమస్య తెలుసుకున్న శ్రీ భగత్ సింగ్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు వారి ఇంటికి వెళ్లి రూ.15వేలు ఆర్థిక సాయం చేస్తూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు లోతుగెడ్డ శివ, కె.పొలినాయుడు, రవి, జామి గోవిందరావు, సంతోష్ పాణిగ్రహి ఉన్నారు.

సీతంపేట మండలం పులిపుట్టి గ్రామానికి చెందిన పాత్రికేయుడు గొర్లె గడ్డెన్న గతేడాది రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. దీంతో రూ. 10 లక్షలు పమాద బీమా చెక్కును మృతుడు భార్య సుజాతకు సర్పంచ్ పడాల కృష్ణవేణి, పోస్టల్ సూపరింటిండెంట్ శ్రావణ్, ఐపిపిబి మేనేజర్ షరీఫ్ బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా సూపరింటిండెంట్ మాట్లాడుతూ రూ.520 భీమా కడితే రూ.10 లక్షల ప్రమాద బీమా ఏడాదిలో పొందవచ్చన్నారు. అలాగే పోస్టల్‌లో అనేక పథకాలున్నాయని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌పిఎం శ్రీనివాసరావు, ఎల్.రాంబాబు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: మండలంలో అనాథులుగా ఉన్న పలువురికి ఆహార పదార్థాలను అన్నవరం హెల్పింగ్ హ్యాండ్స్ అందించి దాతృత్వం చాటుకున్నారు. కవిటి గ్రామానికి చెందిన ఒకదాత ఆర్థికసాయంతో బుధవారం అన్నవరం హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో ధనాలమ్మ ఆలయం వద్ద, రోడ్డు పక్కన ఉన్న 20 మంది అభాగ్యులకు ఆహారం, వాటర్ బాటిళ్లను అందించారు. కార్యక్రమంలో అన్నవరం హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు గోపి బిసాయి, లలిత బిసాయి, రాజేష్ పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు : ఒడిషా రాష్ట్రం నుంచి బతుకు తెరువు కోసం వచ్చి అనారోగ్యం పాలై జీవనోపాధి కరువై పూట గడవక ఇబ్బంది పడుతున్న నర్సిపురం గ్రామానికి చెందిన మహిళ లక్ష్మమ్మ పరిస్థితి తెలుసుకొని మైటీ సంస్థ సభ్యులు బుధవారం ఆమె ఇంటికి వెళ్లి రూ.2 వేలు ఆర్థికసాయంతో పాటు నిత్యావసరాలను అందించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు కోటిపల్లి రాకేష్, సభ్యులు ఇరోతు రాంకీ, ఉప్పరపల్లి సతీష్, అశీష్, అభిలాష్, సంస్థ ప్రతినిధి రవితేజ పాల్గొన్నారు.

సంతబొమ్మాళి : ఇటీవల తీవ్రమైన అనారోగ్యంతో బాధపడుతూ విశాఖపట్నం ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వల్లేవలస గ్రామానికి చెందిన అల్లం కోటేశ్వరరావు ఆర్థిక పరిస్థితి ఇబ్బందిగా ఉండటంతో మనబడి వెల్ఫేర్ అసోసియేషన్ తక్షణ సాయం కింద అమెరికాకు చెందిన 'వి ఫర్ నీడీ' సంస్థ రూ.20 వేలు ఆర్థిక సాయం కోటేశ్వరరావు కుటుంబసభ్యులకు అందించారు. కార్యక్రమంలో మనబడి అసోసియేషన్ ప్రతినిధులు రెడ్డి సూరిబాబు మాస్టర్, గేదెల శివారెడ్డి, ఇప్పిలి అప్పన్న, జగదీష్, సాయిబాబా పాల్గొన్నారు.

లావేరు: మండలం గుమ్మాడం పంచాయతీ నాగంపాళెంకు చెందిన బోర గురునాయుడు కుటుంబానికి అండగా ఉంటామని టిడిపి యువ నాయకుడు మజ్జి రామ్మూర్తి అన్నారు. గురునాయుడు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకుని రామ్మూర్తి బుధవారం ఆ కుటుంబాన్ని పరామర్శించారు. తక్షణసాయంగా రూ.5 వేలు మృతుని భార్య ఈశ్వరమ్మకు అందజేశారు. ఎటువంటి సహాయం కావాలన్న అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు గొర్లె చిన రామస్వామి, పెద్ద రామస్వామి, నూకరాజు, కె.ఉగాది, గంగునాయుడు పాల్గొన్నారు.

దీక్షల్లో పాల్గొన్న వి.జల్లుపుట్టుగ గ్రామస్తులు

కొనసాగుతున్న దీక్షలు

ప్రజాశక్తి- కవిటి

తమ బిడ్డల ఉన్నత చదువులు, యువతీ, యువకుల ఉద్యోగాన్వేషణ కోసం తమకు తప్పనిసరిగా కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాలని బెంతు ఒరియాలు స్పష్టం చేశారు. తమ భవిష్యత్ భరోసా కోసం బెంతు ఒరియాలు చేస్తున్న రిలే నిరాహారదీక్షలు 70వ రోజుకి చేరుకున్నాయి. అందులో భాగంగా బుధవారం దీక్షలో వి.జల్లుపుట్టుగ గ్రామస్తులు పాల్గొని తమ సంఘీభావం తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ తమజాతికి గుర్తింపు లేకపోవడంతో విద్యార్థుల ఉన్నత చదువులు, నిరుద్యోగుల ఉపాధి గాల్లోపెట్టిన దీపంలా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పథకాలకు కూడా దూరమవుతుందన్నారు. కార్యక్రమంలో రాజు సాహు, జయసేన్ బిసాయి, రాజన్ సాహు, సునీల్ బిసాయి, జొయో, మోహన్, దయానిధి, దుదిస్టి పాల్గొన్నారు.

టిడిపితోనే బిసిలకు గుర్తింపు

ప్రజాశక్తి- టెక్కలి

టిడిపి హయాంలోనే బిసిలకు గుర్తింపు లభిస్తుందని టిడిపి మండల అధ్యక్షులు బగాది శేషగిరి అన్నారు. బుధవారం పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. బిసిల అభివృద్ధి, సంక్షేమానికి ఎనలేని గుర్తింపు తెచ్చామన్నారు. సబ్‌ప్లాన్ నిధులు ద్వారా చంద్రన్న బీమా వంటి సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. సమావేశంలో నాయకులు హనుమంతు రామకృష్ణ పోలాకి షణ్ముకరావు, మామిడి రాము, మెండ దమయంతి, కోళ్ల లవకుమార్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం విస్తరణకు కృషి

ప్రజాశక్తి- కొత్తూరు

ప్రకృతి వ్యవసాయం విస్తరణకు కృషి చేస్తున్నామని ఐటిడిఎ ఎన్ఎఫ్ఎ ములయ్య తెలిపారు. స్థానిక మండల మహిళా సమస్య కార్యాలయం వద్ద ఐటిడిఎ, ఎపిఎం జనార్ధనరావు, మండల మహిళా సమాఖ్య అధ్యక్షులు జయమ్మ ఆధ్వర్యాన ప్రకృతి వ్యవసాయ విభాగం రైతు సాధికారిక సంస్థ, గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ, స్త్రీనిధి సంస్థలు ఒప్పంద పత్రం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముసలయ్య మాట్లాడుతూ వచ్చే రోజుల్లో మానవ మనుగడ ఉండాలంటే ప్రకృతి వ్యవసాయం తప్పక చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఎం.టి.సూర్యనారాయణ, యూనిట్ ఇన్‌ఛార్జిలు చిన్నమ్మి, పెంటయ్య, గోవింద్, జనార్ధన్, రవి సిసిలు గోవింద్, ధనలక్ష్మి పాల్గొన్నారు.

కంచిలి: ప్రకృతి వ్యవసాయం మంచి ఆరోగ్యకరమైన ఆహారాన్ని మనకు అందిస్తుందని ఐకెపి ఎపిఎం ఉమాదేవి అన్నారు. స్థానిక కార్యాలయం వద్ద మహిళా సమాఖ్య సభ్యులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సాధికార సంస్థ సభ్యులతో, స్త్రీనిధి సభ్యులతో అంగీకారాలను కుదురుచ్చారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా అధిక దిగుబడులు సాధించడమే కాకుండా నాణ్యమైన ఉత్పత్తులు పొందవచ్చు అన్నారు. వీటి ద్వారా ప్రజల ఆరోగ్య ప్రమాణాలను సైతం మెరుగుపరచవచ్చు పేర్కొన్నారు. ప్రకృతి వ్యవసాయం వల్ల కాలుష్యాన్ని సైతం నియంత్రించవచ్చు అన్నారు. ప్రకృతి వ్యవసాయాన్ని అందరూ ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిబ్బంది శివానంద, కామరాజు పాల్గొన్నారు.

'కౌముది'లో ఫేర్‌వెల్

శ్రీకాకుళం అర్బన్ : నగరంలోని బలగలోని అమర్ కౌముది స్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమం, ప్రీ ప్రైమరి పిల్లల రైమ్స్ కర్నివాలా ఘనంగా నిర్వహించారు. అమర్ కౌముది డైరెక్టర్, ప్రిన్సిపాల్ పొన్నాడ రమణమూర్తి విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ప్రోగ్రాం కన్వీనర్స్ మాధవి, మూర్తి పాల్గొన్నారు.

శ్రీరామనగర్ కాలనీలో అన్నదానంలో పాల్గొన్న భక్తులు

ఎస్ఆర్ఎన్ కాలనీలో అన్నదానం

ప్రజాశక్తి- పొందూరు

మండలం తండ్యాం పంచాయతీ శ్రీరామనగర్ కాలనీలో దుర్గాదేవి అమ్మవారి ఆలయ మహోత్సవం సందర్భంగా బుధవారం భారీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పరిసర గ్రామాలకు చెందిన వేలాది మంది భక్తులు ఈ అన్నదాన కార్యక్రమానికి హాజరయ్యారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రామ్మల్లిక్ నాయుడు పరామర్శ

ప్రజాశక్తి- లావేరు

మండలంలో సిగురికొత్తపల్లి పంచాయతీ బొంతుపేటకు చెందిన టిడిపి కార్యకర్తలు సనపతి కృష్ణ, మండల అప్పన్న, రాములమ్మ, గోవిందరావులు ఇటీవల ప్రమాదవశాత్తు గాయాల పాలయ్యారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్మల్లిక్ నాయుడు వారిని పరామర్శించారు. ఈయన వెంట మాజీ సర్పంచ్ కోనేటి శ్రీనువాసరావు, బొంతు వెంకటరమణ, వాళ్లే జగదీష్, కెళ్ల రమణ ఉన్నారు.

బిసి ముసుగులో ప్రజలకు మోసం

ప్రజాశక్తి- పలాస

గౌతు లచ్చన్న స్ఫూర్తిని గౌతు శిరీష కాలరాస్తూ బిసి ముసుగు వేసుకుని పలాస ప్రజలను మోసం చేస్తున్నారని వైసిపి నాయకులు ఆరోపించారు. కాశీబుగ్గ ప్రగతి భవనంలో బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ గౌతు శిరీష వలన ఎంతో మంది బిసిలు రాజకీయంగా ఎదగ లేకపోయారని విమర్శించారు. పలాసలో అత్యంత తక్కువ ఓటు బ్యాంకు కలిగిన వారికి రాజకీయాల్లో అవకాశం కల్పించి నిజమైన బిసిలకు అర్హత ఉన్న బిసిలకు అన్యాయం చేస్తున్నారని దుయ్యబట్టారు. సమావేశంలో వైసిపి పట్టణ అధికార ప్రతినిధులు శిష్టు గోపి, గుజ్జు జోగారావు, కౌన్సిల్ ప్రతినిధులు బడగల బల్లయ్య, బల్ల శ్రీనివాస్, కో-ఆప్షన్ మెంబర్ బమ్మిడి సంతోష్ కుమార్, కౌన్సిలర్ బెల్లాల శ్రీను, పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న వైసిపి నాయకులు